

APTEL/26/A2902

గ్లోబల్ వార్త

తెలుగు దినపత్రిక



సంపుటి : 01 | సంచిక : 65 | 26 - 10 - 2026 | సోమవారం | పేజీలు : 8 | వెల : 09 /-

Published In Srikakulam , Vijayanagaram , Vishakapatnam, Araku , Anakapalli , Kakinada , Narasapuram, Amalapuram, Rajamundry, Eluru , Machilipatnam , Vijayawada



తరుముకొస్తున్న తుఫాన్

- ఆర్నబ్ అలజడి..విశాఖకు 820 కి.మీ.ల దూరంలో కేంద్రీకృతం
- నేడు తుఫాన్గా.. రేపు ఉదయానికి తీవ్ర తుఫాన్గా,
- సాయంత్రానికి అతి తీవ్ర తుఫాన్గా మార్పు
- 28న యానాం వద్ద తీరం దాటే అవకాశం!
- శ్రీకాకుళం నుంచి బాపట్ల జిల్లాల వరకూ భారీ నుంచి అతి భారీగా
- అన్ని ఓడరేవుల్లో ఒకటో నంబరు భద్రతా సూచిక

విశాఖపట్నం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త) : ఆర్నబ్' తీవ్ర తుఫాన్ రాష్ట్రంపై పడగ విప్పుకొని ఉంది. కోస్తాంధ్ర దిశగా పయనిస్తున్న తీవ్ర వాయుగుండం.. సోమవారానికి తుఫాన్గా.. మంగళవారం ఉదయానికి తీవ్ర తుఫాన్గా, సాయంత్రానికి అతి తీవ్ర తుఫాన్గా మారనుంది. ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో కోస్తాంధ్ర జిల్లాల్లో మూడు రోజుల పాటు అటు శ్రీకాకుళం నుంచి ఇటు బాపట్ల జిల్లా వరకూ

మిగతా 2లో...



ఓట్ బచావో.. దేశ్ బచావో : రాహుల్

న్యూఢిల్లీ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త) : ఓటు హక్కుపై జరుగుతున్న దాడిని ఊరికే చూస్తూ ఊరుకోబోమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. 'ఓటూ మీదే.. పోరాటమూ మీదే' అంటూ... రాజ్యాంగాన్ని, ఓటు హక్కును పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ కదలి రావాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ప్రజా తీర్పును కాల రాసే కుట్రలు జరుగుతున్నాయని

సైబర్ దాడులతో ఆర్థిక వ్యవస్థకు ముప్పు : మోదీ



భువనేశ్వర్ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త) : దేశ ఆర్థిక వ్యవస్థను బలహీనపరిచేందుకు సైబర్ దాడులు కూడా ముప్పుగా మారుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మారుతున్న సైబర్ ముప్పులను ఎదుర్కొనేందుకు ఆధునిక మౌలిక సదుపాయాలు, పటిష్టమైన కంప్యూటింగ్ వ్యవస్థలు, నైపుణ్యం కలిగిన సిబ్బంది అవసరమని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు, సైబర్ ఉగ్రవాదుల నుంచి భారత బ్యాంకింగ్ వ్యవస్థను కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. ఆదివారం ఒడిశా రాజధాని భువనేశ్వర్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) డేటా సెంటర్, సైబర్ సెక్యూరిటీ శిక్షణా సంస్థను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

సైబర్ ముప్పులను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి

భారత్ ఆర్థికంగా బలపడుతున్న కొద్దీ బ్యాంకింగ్ వ్యవస్థ భద్రతకు ప్రాధాన్యం పెరుగుతోందని మోదీ అన్నారు. పాతబడిన వ్యవస్థలు, శిక్షణా పద్ధతులు, సాధనాలతో కొత్త సవాళ్లను ఎదుర్కోవడం సాధ్యం కాదని పేర్కొన్నారు. సైబర్ దాడుల నుంచి ఆర్థిక వ్యవస్థను రక్షించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆర్బీఐ డేటా సెంటర్, సైబర్ సెక్యూరిటీ శిక్షణా సంస్థ దేశ బ్యాంకింగ్ మౌలిక సదుపాయాల భద్రతను, సంక్షోభాలను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

చిన్న పట్టణాలు, గ్రామాలకు డిజిటల్ సేవలు

దేశంలో అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తికి చేరేలా పాలన



ఎంతటి లక్ష్యమైనా భారత బలగాలను దాటిపోలేదు

ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్

న్యూఢిల్లీ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త) : భారత సాయుధ దళాలకు అందని లక్ష్యమంటూ ఏదీ లేదని, ఏ శత్రువైనా, ఏ ప్రాంతమైనా మన బలగాల పరిధిలోనే ఉందని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ స్పష్టం చేశారు. గతేడాది పాకిస్థాన్లోని ఉగ్రవాద స్థావరాలపై నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' ఈ విషయాన్ని ప్రపంచానికి స్పష్టంగా నిరూపించిందని ఆయన అన్నారు. అక్టోబర్ 31న పదవీ విరమణ

ప్రజలకు ఇబ్బందులు రాకూడదు! : సీఎం

- ఎక్కడా ప్రాణ నష్టం జరగకూడదు
- ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత తగ్గించాలి
- మొబైల్ ఫోన్లకు అలర్ట్ మెసేజ్లు పంపాలి
- అన్ని స్థాయుల్లో సమన్వయంతో పని చేయాలి
- పునరావాస కేంద్రాల్లో వసతులు కల్పించాలి
- అధికారులకు సీఎం దిశానిర్దేశం.. సమీక్ష



అమరావతి , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త) : ఆర్నబ్' తుఫాన్ నేపథ్యంలో అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, అత్యున్నత సన్నద్ధత, ముందస్తు ప్రణాళికతో అన్ని స్థాయుల్లో ప్రభుత్వ యంత్రాంగం పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుందన్న సమాచారం నేపథ్యంలో అన్ని శాఖలూ సమన్వయంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని నిర్దేశించారు. అర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో ప్రజల తరలింపు, పునరావాస కేంద్రాలు, ఆహారం, తాగునీరు, వైద్యం, విద్యుత్ పునరుద్ధరణ వంటి అంశాల్లో సన్నద్ధతపై ఆదివారం ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. సీఎస్ సాయిప్రసాద్, డీజీపీ హరీష్గుప్తా, జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 'తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేయాలి. తుఫాన్ ప్రభావంపై ప్రజల ఫోన్లకు నిరంతరం సమాచారం ఇచ్చి, అప్రమత్తం చేయాలి. ఎప్పటికప్పుడు ముందస్తు సూచనలు, హెచ్చరికలు జారీ చేయాలి. ఎక్కడా ప్రాణనష్టం జరగకూడదు. ఆస్తి నష్టం సాధ్యమైనంత తగ్గించాలి. జీరో ఇన్సిడెంట్స్ లక్ష్యంగా అన్ని స్థాయుల్లో ప్రభుత్వ వ్యవస్థలు సమన్వయంతో పని చేయాలి. ప్రభుత్వ సూచనలు పాటించేలా తీర ప్రాంత గ్రామాల ప్రజలను ఒప్పించాలి. శాటిలైట్ సమాచారంతో సైంటిఫిక్ డేటా ఆధారంగా చర్యలు తీసుకోవాలి. ప్రతి నాలుగు గంటలకూ తుఫాన్పై బులెటిన్ విడుదల చేయాలి. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన చోట



ప్రేక్షక పాత్ర వద్దు.. జోక్యం చేసుకోండి!

రష్యా - ఉక్రెయిన్, పశ్చిమాసియా యుద్ధాలపై జైశంకర్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త) : ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, సంక్షోభాలు కొనసాగుతున్న వేళ ఐక్యరాజ్యసమితి (ఐరాస) ప్రేక్షక పాత్రకే పరిమితం కాకుండా నాయకత్వం చూపాలని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సూచించారు. రష్యా--ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్లకు సంబంధించిన ఘర్షణల

జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల తుది జాబితా

పరిషత్ ఎన్నికల నామినేషన్ల తుది జాబితాను విడుదల చేసిన ఎస్ఈసీ



అమరావతి , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త) : ఆంధ్రప్రదేశ్లో జరగనున్న పరిషత్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టం ముగిసింది. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు దాఖలైన నామినేషన్ల పరిశీలన అనంతరం రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఆదివారం తుది జాబితాను ప్రకటించింది. నామినేషన్ల తిరస్కరణ తర్వాత ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలను అధికారులు అధికారికంగా వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9,829 ఎంపీటీసీ స్థానాలకు గాను 46,045 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. పార్టీల వారీగా పరిశీలిస్తే.. టీడీపీ నుంచి 19,760, వైసీపీ నుంచి 17,726, జనసేన నుంచి 4,330, బీజేపీ నుంచి 1,049 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరితో పాటు మరో 2,012 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 51,902 నామినేషన్లు దాఖలు కాగా, వివిధ కారణాలతో అధికారులు 5,857 నామినేషన్లను తిరస్కరించారు. మరోవైపు, 659 జడ్పీటీసీ స్థానాలకు 4,770 నామినేషన్లు ఆమోదం పొందాయి. వీటిలో టీడీపీ తరఫున 1,693, వైసీపీ తరఫున 1,445, జనసేన నుంచి 587, బీజేపీ నుంచి 227 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. మరో 227 మంది స్వతంత్ర అభ్యర్థులు సైతం ఎన్నికల



రాష్ట్రానికి మరో మణిహారం

అమరావతి , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త) : రాష్ట్రానికి మరో మణిహారం రానుంది. రాయలసీమలో ఏర్పాటవుతున్న రక్షణ రంగానికి సంబంధించిన ఓ భారీ ప్రాజెక్టు త్వరలోనే అందుబాటులోకి రానుంది. కేంద్ర ప్రభుత్వ రంగానికి చెందిన నవరత్న కంపెనీల్లో ఒకటైన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) శ్రీసత్యసాయి జిల్లా, గోరంట్ల మండలం, పాలసముద్రం వద్ద రూ.2,500 కోట్ల పెట్టుబడితో భారీ రక్షణ తయారీ యూనిట్ను ఏర్పాటు చేస్తోంది.



విద్యుత్, ఆరోగ్య శాఖలు అప్రమత్తం

మంత్రులు గొట్టిపాటి, అనిత సమీక్ష

- 25 వేల విద్యుత్ స్తంభాలు, ఇతర సామగ్రి సిద్ధం
- కీలక సిబ్బందికి సెలవులు రద్దు

అమరావతి , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త) : 'ఆర్నబ్' తుఫాను నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్, హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. తుఫాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు మంత్రులు, అధికార యంత్రాంగం

APTEL/26/A2902

గ్లోబల్ వార్త
తెలుగు దినపత్రిక

సంపాదకీయం

నిరసనలన్నీ ముస్లింల ఖాతాలోనే..!

ప్రపంచ దేశాల్లో ఇప్పుడొక ఒక విచిత్రమైన సంప్రదాయం కొనసాగుతోంది. తినడానికి తిండి దొరక్కపోయినా, ఉద్యోగాలు లేకపోయినా, మంచిచదువు అందకపోయినా, వైద్యం దొరక్కపోయినా ప్రజలు ప్రభుత్వాలను ప్రశ్నిస్తారు. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పుకోలేక పాలకులు ఆ నిందను ముస్లింల మెడకు చుడుతున్నారు. ఫ్రాన్స్, గ్రీస్, ఇటలీ తదితర యూరోపియన్ దేశాలలో యువతరం పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేస్తున్నది. ఈ అసంతృప్తికి పరిష్కారం చూడమని సలహా ఇవ్వాల్సిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'పారిస్ అతి త్వరలో ముస్లింల నగరంగా మారబోతోంది!' అని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యూయేల్ మేక్రాన్‌ను హెచ్చరించాడు. భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాను కోరుతూ ఢిల్లీ జంతర్ మంతర్‌లో నిరసన ప్రదర్శనకు కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు ఇచ్చినపుడు దాన్ని ఆపడానికి మోదీ సర్కార్ జెన్‌జీపై ఉక్కుపాదం మోపింది. ఏకంగా 30 వేల మందికి పైగా సాయుధ బలగాల్ని మోహరించింది, నిషేధాజ్ఞలు పెట్టింది, మొబైల్ ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేసింది. 45 మెట్రో స్టేషన్లను మూసివేసి, ఢిల్లీకి వచ్చే దాదాపు 250 రైళ్లను రద్దు చేసింది. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు లేదా అన్న ప్రశ్నకు ప్రభుత్వం దగ్గర ఒక గొప్ప సమాధానం ఉంది. అది అప్పుడప్పుడు నోటితో చెపుతుంది, కుదరనప్పుడు సోషల్ మీడియా వాడుతుంది. 'సాధారణంగా ఈ రైళ్లలో ఒక నిర్దిష్ట వర్గానికి చెందిన ప్రయాణికుల రిజర్వేషన్లు 10 నుంచి 15శాతం మాత్రమే ఉంటాయట. కానీ అక్టోబర్ 9, 10 తేదీల్లో ఆ సంఖ్య 40 నుంచి 60 శాతానికి పెరిగిపోయిందట! ఎవరీ నిర్దిష్టవర్గం? ముస్లింలు అని చెప్పకనే చెప్పారు. ప్రభుత్వం నిందలు వేస్తుంది. ఆధారాలు చూపదు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనేవి మన రాజ్యాంగ ఆదర్శాలు. ఈ మహోన్నత భావాల పుట్టినిల్లు 1789 నాటి ఫ్రెంచ్ విప్లవం. ఇప్పుడు ఆ పుట్టినింటిలోనే ఈ ఆదర్శాలకు ముప్పు వచ్చింది. ప్రస్తుత ఫ్రాన్స్ పరిస్థితి విక్టర్ హ్యూగో 1862లో రాసిన 'లే మిజరబుల్స్' ఫ్రెంచ్ నవలకు పోలి ఉంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఈ నవల అనేకభాషల్లో అనువాదమయింది. తెలుగులో రెండుసార్లు బీదలపాట్లు పేరుతో సిని మాగా వచ్చింది. పిల్లల ఆకలిని చూడలేక రొట్టెను దొంగిలించి జైలు పాలవుతాడు ప్రధానపాత్ర జీన్ వాల్జీన్. పిల్లల్ని చూడాలని జైలునుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడంతో శిక్షను 19 ఏళ్లకు పెంచుతారు. ఇటీవల ప్రపంచ దేశాలన్నింటిలోనూ సంపద పంపకాల్లో ఒక సాధారణ నియమం కనిపిస్తున్నది. దేశ సంపదలో అత్యధికం కొద్ది కుటుంబాల చేతుల్లో కేంద్రీకృతమవుతోంది. అతి తక్కువ సంపదను అత్యధిక కుటుంబాలు పంచుకోవాల్సి వస్తున్నది. ఫ్రాన్స్‌లో ప్రభుత్వ విద్యాసంస్థల్ని మూసేస్తున్నారు, క్లాస్ రూములు కిక్కిరిసిపోతున్నాయి. టీచర్లు లేరు. జీతాలు ఇంటి అద్దె చెల్లించడానికి కూడ సరిపోవడం లేదు. ఇంట్లో ఒక్కరికి ఆరోగ్య సమస్య వచ్చినా కుటుంబం రోడ్డున పడాల్సి వస్తోంది. ఈ దయనీయ పరిస్థితుల మీద పత్రికలు పుంఖాను పుంఖలుగా కథనాలు ప్రచురించాయి. సెప్టెంబర్‌లో అసహనం బద్దలయింది, అక్టోబర్‌లో తార స్థాయికి చేరుకుంది. సీజేపీ నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాల జ్యుడిషియల్ కస్టడీ కేసు విచారణకు వచ్చినపుడు ఢిల్లీ హైకోర్టు బెంచి మీరిద్దరూ జెన్--జీ కాదుకదా? అని ఒక ఆసక్తికర వ్యాఖ్య చేసింది. 1997--2012 మధ్య కాలంలో పుట్టిన వారిని జెన్--జీ అంటారు. వాళ్ళిద్దరూ అంతకన్నా ముందు పుట్టారని హైకోర్టు బెంచి గుర్తు చేసింది. ఫ్రాన్స్‌లో నిరసన ప్రదర్శనలకు నాయకత్వం వహిస్తున్న ర్యాధ్ రానీ 2007లో పుట్టాడు. అచ్చమైన జెన్--జీ. ముక్కుపచ్చలారని ఈ 19 యేళ్ళ కుర్రాడు హైస్కూలు విద్యార్థి యూనియన్ యాక్టివిస్టు. ఇప్పుడు ఇదొక ట్రెండ్. పటిష్ఠమైన నిర్మాణాలున్న వ్యక్తులు, సంస్థలు చేయలేని అద్భుతాలను 'కుర్రకుంకలు' చేసేస్తున్నారు. వీళ్లు ఎంతకాలం నిలబడతారూ వంటి ప్రశ్నలు సహజంగానే ముందుకు వస్తాయి. సీజేపీ నాయకుడు అభిజిత్ దీప్కేమీద మన దగ్గర కూడ అప్పుడే గుసగుసలు మొదలయ్యాయి. నిజానికి అతను చేయాల్సిన పనిని ఈ పాటికే చేశాడు. సింహాసనాన్ని వణికించాడు, ఆ సింహాసనం మీద ప్రజల్లో భయాన్ని పోగొట్టేశాడు. సీజేపీ నిలదొక్కుకుంటుందా? ఎవరితో జత కడుతుంది? వగైరాలన్నీ జరగవచ్చు, జరక్కపోనూవచ్చు. అయినప్పటికీ అభిజిత్ ఈ పాటికే చేసిన పని చరిత్రలో నిలిచిపోతుంది. ఫ్రాన్స్ నిరసన ప్రదర్శనల్లో మనకు టోపీవాలాలు, బుర్ఖా మహిళలు కనిపించరు. కానీ, ట్రంప్ వంటివాళ్ళు వాళ్లందర్నీ ముస్లింల ఖాతాలో వేస్తున్నారు. కొత్త పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా సాగిన షాహీన్ బాగ్ ఉద్యమం అచ్చంగా ముస్లిం మహిళలు నడిపిన కార్యక్రమం. ఈ జంతర్ మంతర్ ఉద్యమం అలా కాదు. నిరసనల్లో చాలా అరుదుగా మాత్రమే ముస్లింలు కనిపిస్తారు. అయినప్పటికీ ముస్లింలే దాన్ని నిర్వహిస్తున్నారని ప్రభుత్వవర్గాలు ప్రచారం చేస్తున్నాయి. పోలీసులకు ఒక అపద్ధర్మ నియమం ఉంటుంది. 'ఎప్పుడూ అనుమానించేవాళ్లనే మళ్లీ పట్టుకోండి!' ఏదైనా ఒక పెద్ద సంఘటన జరగ్గానే వాళ్ళు హడావిడిగా కొందరిని అరెస్టు చేసి, అప్రమత్తంగా ఉన్నామనే సంకేతాన్ని ఇస్తుంటారు. 2007 మే నెలలో హైదరాబాద్ మక్కా మసీదులో పేలుడు జరిగినపుడు పాతబస్తీలో అనేకమంది ముస్లింలను జైళ్లకు పంపించారు. మీడియా చెలరేగిపోయింది. కొంతకాలం తరువాత ఆ సంఘటన వెనుక అభినవ భారత్ అనే సంస్థ పేరు బయటికి వచ్చింది. స్వామీ ఆసీమానంద తదితరుల్ని అరెస్టు చేసి ముస్లింలను విడుదల చేశారు. 2020 మార్చి నాటి సంచలన నిజాముద్దీన్ మర్కజ్--కరోనా సూపర్ స్ప్రెడర్ కేసు కూడ ఇలాంటిదే. మర్కజ్‌లో ముస్లింలు కరోనాను 'సోకించుకుని' దాన్ని దేశమంతా వ్యాపింపచేయాలని కుట్ర చేశారనేది ఆరోపణ. ఈ మాత్రం ఉప్పు అందగానే 'ఒళ్ళో మీడియా' (గోదీ మీడియాకు తెలుగు) చెలరేగిపోయింది. ఆ సందర్భంగా మర్కజ్‌లో వున్న 70 మందిని అరెస్టు చేశారు. విచిత్రం ఏమంటే వైద్య పరీక్షల్లో వారిలో ఒక్కరికీ కరోనా పాజిటివ్ రాలేదు. ఢిల్లీ హైకోర్టు, అలహాబాద్ హైకోర్టు ఈ కేసుల్ని నిరాధారంగా తేల్చి కొట్టిపడేశాయి. ఈ లోపు ముస్లిం ఫోబియా తెగ ప్రచారం అయిపోయింది. దేశ సంపద పెరిగినంత మాత్రాన ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని అనుకోవడానికి వీల్లేదు. కార్పొరేట్ లాభాలు పెరగవచ్చు, స్టాక్ మార్కెట్లు ఎగబాకవచ్చు. కానీ ఆ సంపదలో సామాన్యులకు ఎంత వాటా దక్కుతోంది? అనేది ప్రశ్న. ద్రవ్యోల్బణం అంటే కేవలం మార్కెట్లో ధరలు పెరగడం కాదు. ఆదాయాలు, ఖర్చుల మధ్య సంబంధం కూడా ముఖ్యం. ధరలు పెరుగుతున్నప్పుడు ఆదాయం పెరగకపోతే, ప్రజల వాస్తవ కొనుగోలు శక్తి పడిపోతుంది. ఫ్రాన్స్ ఆందోళనకారులు మూడే ప్రశ్నలు అడుగుతున్నారు. ఒక టీచర్ జీతంతో కుటుంబ ఖర్చులు తీరుతున్నాయా? ఒక విద్యార్థి భవిష్యత్తుకు సమాన అవకాశాలు ఉన్నాయా? ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయా? ఈ ప్రశ్నలకు సమాధానం దొరికేవరకు ర్యాధ్ రానీ కాక పోతే మరొకరు జనాన్ని రోడ్ల మీదికి తీసుకుని వస్తారు. ఇది చర్యకు ప్రతిచర్య. చర్యను ఖండించని వారు ప్రతిచర్యను ఖండించడం సబబు కాదు. ట్రంప్ మేక్రాన్‌ను హెచ్చరించడం చాదు గానీ అతని భయాలు అతనికి ఉన్నాయి.



ఎడిటర్ : దొండ్లవాగు భవ్య

రాష్ట్రానికి మరో మణిహారం

ఒకటి తరువాయి

దీనికోసం శ్రీసత్యసాయి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం 'బెల్'కు 914 ఎకరాలు కేటాయించింది. ఇక్కడ బెల్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (డీఎంసీ)ను ఏర్పాటు చేస్తోంది. ఈ క్లస్టర్‌లో 800 మందికి ఉద్యోగావకాశాలు దక్కనున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన జరిగిన ఈ ప్రాజెక్టు.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అటకెక్కింది. కూటమి సర్కారు రాకతో ఏపీ పారిశ్రామిక అభివృద్ధి విధానం (2024-29)లో భాగంగా ఈ ప్రాజెక్టు పనులు మళ్లీ ఊపందుకున్నాయి. ఏపీ పారిశ్రామిక అభివృద్ధి విధానం కింద ఈ నవరత్న కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తోంది. ప్రాజెక్టు క్యాపిటల్ ఇనట?్వస్టమెంట్ కింద 45 శాతం మేర పెట్టుబడి రాయితీని 15 ఏళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. రాయలసీమలో డిఫెన్స్, ఏరోస్పేస్, డ్రోన్ తయారీ సంస్థలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. ఇందులో భాగంగా బెల్ ఏర్పాటు చేసే ఈ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మొదటి, రెండో దశ నిర్మాణ పనులను 2029 నాటికి పూర్తిచేసి, రక్షణ రంగ ఉత్పత్తులను తయారు చేస్తుందని అధికారులు వెల్లడించారు. ఈ డిఫెన్స్ క్లస్టర్‌లో క్షిపణి వ్యవస్థలతోపాటు అత్యాధునిక రక్షణ పరికరాలు తయారు చేస్తారని అధికారులు పేర్కొన్నారు.

దేశ సేవలో భాగస్వామ్యం: మంత్రి లోకేశ్


కేంద్ర నవరత్న కంపెనీల్లో ఒకటైన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) రాష్ట్రానికి వస్తోందని, త్వరలోనే రక్షణరంగ పరికరాలను తయారు చేసేందుకు సిద్ధమవుతోందని మంత్రి లోకేశ్ వెల్లడించారు. 'బెల్' రూ.2,500 కోట్లతో రాయలసీమలోని శ్రీసత్యసాయి జిల్లాలో రక్షణ రంగ పరికరాల తయారీ క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తోందని ఆదివారం ఆయన 'ఎక్స్'లో వెల్లడించారు. ఈ క్లస్టర్ ద్వారా మన యువతలో 800 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని సంతోషం వ్యక్తం చేశారు. చెప్పినట్టుగానే చేసి చూపించాం అని పేర్కొంటూ బెల్ ఏర్పాటు చేస్తున్న డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ పనులకు సంబంధించిన వీడియోను పోస్టు చేశారు. దేశ రక్షణ రంగంలో వినియోగించే అత్యాధునిక యుద్ధ పరికరాల తయారీ కేంద్రాన్ని రాయలసీమ ప్రాంతంలో ఏర్పాటు చేయడం ద్వారా దేశ సేవలో రాష్ట్రం భాగస్వామ్యం కానుందని లోకేశ్ ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

పరిశుభ్రత ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత : ఆల్ ఈజ్ వెల్ సభ్యులు



కాకినాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): స్థానిక తోట సుబ్బారావు నగర్ రెండవ వీధిలో లో ఉన్న మున్సిపల్ పార్క్ లో ఆల్ ఈజ్ వెల్ సభ్యుల చే పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఆల్ ఈజ్ వెల్ అధ్యక్షుడు కిశోర్ మాట్లాడుతూ "పరిసరాలు అశుభ్రంగా ఉంటే దోమలు, ఈగలు మరియు హానికరమైన బ్యాక్టీరియా పెరుగి మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, కలరా వంటి ప్రమాదకరమైన అంటువ్యాధులు ప్రబలుతాయని, పరిశుభ్రతను పాటించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, పచ్చని పరిశుభ్రమైన వాతావరణం మన మనసుకు ప్రశాంతతను ఇస్తుందని అన్నారు. కొలగాని మూర్తి మాట్లాడుతూ "పరిశుభ్రత అనేది కేవలం మన ఇళ్లను ఊడ్చడం మాత్రమే కాదని, మన శరీరం, ఇల్లు, వీధులు, పాఠశాలలు, కార్యాలయాలు మరియు మొత్తం పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచుకోవడమే సచ్ఛత అని, మహాత్మా గాంధీ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, "స్వాతంత్ర్యం కంటే పరిశుభ్రతే మిన్న" అని బోధించారని అన్నారు. డా అడ్డాల మాట్లాడుతూ "మన చుట్టూ చెట్లను పెంచడం ద్వారా గాలి శుభ్రపడుతుంది మరియు పరిసరాలు అందంగా మారుతాయని, స్వచ్ఛ భారత్" నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకొని, మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ భావితరాలకు ఆరోగ్యకరమైన సమాజాన్ని అందిద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఈజ్ వెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ రాజకుమార్, కార్యదర్శి టి.వి. వి .ఎస్. ఎన్ రెడ్డి, డాక్టర్ రవివర్మ ,విక్రమ్ , రాజేంద్ర, శ్రీనివాసు , వెంకటనారాయణ, సీనియర్ సిటిజన్లు శ్రీ కరి నాగభూషణం , కృష్ణారావు , స్వామి తదితరులు పాల్గొన్నారు. సుమారు 30 మంది జెన్ గ్రీన్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి సేవలు అందించారు.

కొవ్వాడలో పిల్లి దంపతుల ఇంటింటి ప్రచారం



కాకినాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): కాకినాడ రూరల్ మండలం కొవ్వాడ గ్రామంలో ఆదివారం పిల్లి దంపతులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొవ్వాడ ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నురుకుర్తి ప్రసాద్ (ప్రకాష్)కు మద్దతుగా కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు గ్రామంలో పర్యటించి ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా నురుకుర్తి ప్రసాద్ (ప్రకాష్) గతంలో కొవ్వాడ గ్రామ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన అనుభవాన్ని ప్రస్తావించారు. గ్రామస్థాయిలో పనిచేసిన అనుభవం ఉన్న ఆయనకు అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుస్తూ ఎన్నికల్లో మద్దతు తెలిపి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని పేర్కొంటూ, గ్రామ ప్రజల ఆదరణతో అభ్యర్థి విజయం సాధిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రచారంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రచారంలోబిసి సెల్ అధ్యక్షులు కొమరి శెట్టి నరసింహారావు మండల అధ్యక్షుడు కాళ్ల శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కమ్మ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మారెళ్ళ రామకృష్ణ, పట్టం వెంకటేష్ , లక్ష్మణరావు, లక్ష్మణమూర్తి, బాబురావు,జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు గుమ్మడి వీరబాబు, సానా శ్రీను, ర్యాలీ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

అకాల మరణం చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



రామచంద్రపురం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): తెలుగుదేశం పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ భరోసా ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా, కష్టసుఖాల్లో వారి కుటుంబాలకు తోడుగా నిలుస్తామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఇటీవల అకాల మరణం చెందిన ఇద్దరు పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈరోజు పరామర్శించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రామచంద్రపురం రూరల్ మండలం ద్రాక్షారామంలో రాష్ట్ర బీసీ సెల్ నాయకులు పెంకే సాంబశివరావు మాతృమూర్తి స్వర్గీయ పెంకే చంద్రమ్మ ఇటీవల అకాల మరణం చెందారు. ఈ నేపథ్యంలో మంత్రి సుభాష్ ద్రాక్షారామంలోని వారి స్వగృహానికి వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. చంద్రమ్మ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం పెదతాళ్లపొలం గ్రామానికి చెందిన వనుం రామకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో, ఆయన కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా రామకృష్ణ పార్టీకి ఎనలేని సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో పాటు, సోదరుడు, టీడీపీ కార్యకర్త వనుం చంటి బాబుతో మాట్లాడి, వారికి మనోధైర్యాన్ని కల్పించారు .కార్యకర్తల కుటుంబాలకు అండ గా నిలుస్తాం పార్టీ కోసం అంకి తభావంతో పనిచేసే కార్యకర్తల సేవలను ఎప్పటికీ మరువబోమని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ఆపద సమయంలో కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడం పార్టీ బాధ్యతగా భావిస్తుందని తెలిపారు. వనం రామకృష్ణ కుటుంబానికి పార్టీ తరఫున ప్రమాద బీమా అందేలా అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కష్ట కాలం లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు అండ గా నిలుస్తూ, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం, పార్టీ నాయకత్వం కట్టుబడి ఉన్నాయని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాధపురంలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి..6 మంది అదుపులోకి



కాకినాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ పేకాట, కోడిపందాల వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇచ్చిన ఆదేశాల మేరకు, కాకినాడ డీఎస్పీ ఎన్ ఎస్ వి కె దుర్గారావు పర్యవేక్షణలో, కాకినాడ I టౌన్ సీఐ ఎం నాగ దుర్గా రావు కి అందిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా కాకినాడ I టౌన్ పోలీసులు దాడి నిర్వహించారు.కాకినాడ I టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జగన్నాధపురం, కేసన వారి దొడ్డి వద్ద, ఎస్ఐ పి.వి.సి. స్వామి నాయుడు తమ సిబ్బందితో కలిసి దాడి చేయగా, ఇంటిలో పేకాట ఆడుతున్న మొత్తం 6 మందిని అదుపులోకి తీసుకున్నారు.ఈ దాడిలో వారి వద్ద నుంచి రూ. 12,000 నగదు మరియు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఏ.పి. గేమింగ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పేకాట, కోడిపందాలు తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి కార్యకలాపాల గురించి సమాచారం తెలిసిన ప్రజలు పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

కాకినాడలో 'అస్మిత' ఖేలో ఇండియా సౌత్ జోన్ లిమిహిళల హాకీ లీగ్



కాకినాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): గ్రామీణ ప్రాంతాల్లోని బాలికల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా 'అస్మిత' ఖేలో ఇండియా సౌత్ జోన్ జూనియర్, సబ్-జూనియర్ మహిళల లీగ్ హాకీ టోర్నమెంట్‌ను కాకినాడలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక డీఎస్ఏ గ్రౌండ్‌లో అక్టోబర్ 27వ తేదీ నుంచి నవంబర్ 6వ తేదీ వరకు ఈ ప్రతిష్టాత్మక పోటీలు జరగనున్నాయి. హాకీ ఇండియా గుర్తింపు పొందిన తర్వాత మొదటిసారిగా కాకినాడ ఈ స్థాయి పోటీలకు వేదిక కావడం విశేషం. ఈ లీగ్‌లో సౌత్ జోన్‌కు చెందిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలతో పాటు పలు గుర్తింపు పొందిన క్లబ్ జట్లు పాల్గొంటున్నాయి. టోర్నీలో మొత్తం 6 సబ్-జూనియర్, 6 జూనియర్ జట్లు తలపడనున్నాయి.ఈ జోనల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణులను ఆల్-ఇండియా టోర్నమెంట్‌తో పాటు నేషనల్ క్యాంపులకు ఎంపిక చేయనున్నట్లు ప్రతినిధులు వివరించారు. భవిష్యత్తులో ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై దేశానికి ప్రాతినిధ్యం వహించేలా వారిని తీర్చిదిద్దుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారతను ప్రోత్సహించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా స్థానిక బాలికలకు చక్కటి క్రీడా వేదిక లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకుడు కడియాల రవిచంద్ర ప్రసాద్, అధ్యక్షుడు ఓక బాబ్జీ, ఉపాధ్యక్షురాలు పి. సుధారాణి, కార్యదర్శి అవినాష్, కోచ్ ప్రియాంక టోర్నమెంట్ జాయింట్ సెక్రటరీ ఎన్. దీప్తి ఎస్తేర్, కోశాధికారి (ట్రెజరర్) ఎన్. వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

కాకినాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, కాకినాడ డెయిరీ ఫామ్ సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మహిళల భద్రత, బాల్య వివాహాల నివారణ, ఆన్‌లైన్ మోసాలు, విద్య ప్రాముఖ్యత తదితర అంశాలపై మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ టి. దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మహిళలు, బాలికల భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, విద్య ద్వారా సాధించగల అభివృద్ధి గురించి వివరించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకొని, సమాజంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

ప్రెస్ క్లబ్ బైలా సవరణకు మెజార్టీ సభ్యుల ఆమోదం




రాజమహేంద్రవరం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): ఈ రాజమండ్రి ప్రెస్ క్లబ్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం స్థానిక జాంపేటలోని పోలీస్ కన్వెన్షన్ హాల్లో జరిగింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోతాబాల విజయ సారధి అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరిగింది. తొలుత ప్రెస్ క్లబ్ జనరల్ సెక్రెటరీ గండ్రోతు వేణుగోపాలస్వామి (గోపి) సమావేశాన్ని ప్రారంభించి ప్రెస్ క్లబ్బు వ్యవస్థాపకుల్లో సీనియర్ పాత్రికేయులైన కే సైలేంద్ర, వివిఎస్ కృష్ణకుమార్, పెద్దాడ నవీన్, ప్రెస్ క్లబ్ మాజీ గౌరవ అధ్యక్షుడు మండేలా శ్రీరామ్ మూర్తి, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు కుడిపూడి పార్థసారథి, టి రామనారాయణ, ప్రెస్ క్లబ్ కోశాధికారి శ్రీపాద పురుషోత్తం కుమార్, ఉపాధ్యక్షులు పిఎస్ గంగాధర్, కే దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రెటరీ లు ఎస్ కృపానందం, కే వరప్రసాద్, కార్యవర్గ సభ్యులు కే మధు, ఆకుల ఈశ్వర్, ఆర్ వి వి సత్యనారాయణ, పాత గొలుసుల చంటిబాబు, పాలపర్తి శ్రీనివాస్, గోపాలకృష్ణ, గరగ ప్రసాద్, క్రమశిక్షణ కమిటీ సభ్యులు జే కళాధర్ లకంసాని బలరాం, దాసరి రాము లను వేదిక పైకి ఆహ్వానించారు. ఈ యాడాదిలో మరణించిన ఇద్దరు జర్నలిస్టులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అజెండాలోని అంశాలకు సంబంధించి కొన్ని విషయాలను సెక్రెటరీ గోపి ప్రస్తావించి తదుపరి నూతన కమిటీ మూడు నెలలలో చేసిన అభివృద్ధి సంక్షేమంపై నివేదికను ప్రకటించాల్సిందిగా అధ్యక్షుడు విజయ సారధిని కోరగా మూడు నెలల్లో ప్రెస్ క్లబ్ అభివృద్ధికి చేపట్టిన పనులను అధ్యక్షుడు విజయ సారధి వివరించారు. ఇందులో ప్రెస్ క్లబ్ అభివృద్ధి నిమిత్తం రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సీఎం కాంపోనెంట్ నిధుల నుంచి పది లక్షల రూపాయలను కేటాయించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకి రాజమండ్రి ప్రెస్ క్లబ్ పక్షాన జనరల్ బాడీ సమావేశం వేదికగా ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టాక జర్నలిస్టులకు బిజెపి నాయకులు కంబాల శ్రీనివాస్ సహకారంతో 15 లక్షలు చొప్పున ప్రమాద బీమా చేయించామని, ప్రమాదాల బారిన పడిన జర్నలిస్టులకు, హార్ట్ సర్జరీలు స్టంట్ లు చేయించుకున్న జర్నలిస్టులకు ప్రెస్ క్లబ్ తరపున చేసిన ఆర్థిక సాయం, అదేవిధంగా వృత్తిని నమ్ముకుని సీనియర్స్ గా ఉండి ఆర్థిక పరిస్థితి దయనీయ స్థితిలో ఉన్న ఇద్దరు సీనియర్ జర్నలిస్టులకు నెలవారి ఆర్థిక సహాయం చేయడం, ప్రెస్ క్లబ్ లో డైనింగ్ హాల్లో ప్రెస్ మీట్ లు జరిగినప్పుడు అల్పాహారం మధ్యాహ్న భోజనాలు స్వీకరించేందుకు వీలుగా వాల్ డైనింగ్ వుడ్ ఏర్పాటు చేయడం, ప్రెస్ క్లబ్ కు సంబంధించి విలువైన డాక్యుమెంట్లు పత్రాలను భద్రపరుచుకునేందుకు జనసేన నగర అధ్యక్షుడు వై శ్రీను సహకారంతో ఐరన్ సెల్ఫ్ బీరువా ఏర్పాటు చేయడం, ప్రెస్ క్లబ్ సభ్యుల వివరాలను తెలిసే విధంగా నూతన వెబ్ సైట్ ను రూపొందించడం, ప్రెస్ క్లబ్ నుంచి గుర్తింపు కార్డును సభ్యులకు జారీ చేయడం, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తనయుడు జీవి శ్రీరజ్ సహకారంతో లక్ష విలువ చేసే నెస్ కాఫీ మిషన్ను ఏర్పాటుకు చొరవ తీసుకోవడం, అదేవిధంగా డైనింగ్ హాల్ లో వాల్స్ ఆధునీకరణకు మెటీరియల్ ఇచ్చే విధంగా మరో చూపడం, ప్రెస్ క్లబ్ పై బురద జల్లే విధంగా ఆధారాలు లేకుండా కథనాలు రాసిన, ప్రెస్ క్లబ్ పేరు చెప్పి దందాలకు పాల్పడిన, ప్రతిష్టకు భంగం కలిగించే పనులు చేసిన అటువంటి వారిపై చర్య తీసుకునేందుకు క్రమశిక్షణ కమిటీని ఏర్పాటు చేయడం వంటి బృహత్తర కార్యాలను మూడు నెలల్లో సాధించినట్లుగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు విజయ సారధి తెలిపారు. అనంతరం యజెండాలోని ప్రధాన అంశాలను సెక్రెటరీ గోపి చదివి సభ్యులందరికీ వినిపించారు. అటుపై సీనియర్ పాత్రికేయులు పెద్దాడ నవీన్, కే సైలేంద్ర, కృష్ణ కుమార్, శ్రీరామ్ మూర్తి, కుడిపూడి పార్థసారథి, టి రామనారాయణలు అజెండాలోని బైలానవరణ విషయంపై పలు సూచనలు చేశారు. బైలా సవరణ అనేది తప్పకుండా చేయాలని వివరించారు. అటుపై సభ్యుల అభిప్రాయాలను సమావేశంలో చర్చించడం జరిగింది. ప్రెస్ క్లబ్ కు సంబంధించిన డిపాజిట్లు ఫిక్స్ డిపాజిట్లు,సేవింగ్ బ్యాలెన్స్, షాపుల నుంచి రావాల్సిన అది బకాయిలు తదితర అంశాలపై కోశాధికారి శ్రీపాద పురుషోత్తం కుమార్ సభ దృష్టికి తీసుకువచ్చారు. బైలా సవరణకు సంబంధించి ఇద్దరు సభ్యులు లేవనెత్తిన అంశాలపై చర్చించడం జరిగింది. అటుపై మహాజనసభలో అజెండాలోని అంశాలను సమావేశానికి హాజరైన సభ్యులలో మెజారిటీ సభ్యులు ఆమోదం తెలుపుతూ సంతకాలు చేశారు. దీంతో ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో అజెండాలోని అంశాలను తీర్మానించినట్లు ప్రెస్ క్లబ్ కార్యవర్గం ప్రకటించింది. ఈ సర్వ సభ్య సమావేశంలో 120 మంది ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు రూట్ మ్యాప్‌పై ఆర్వోలకు అవగాహన



కాకినాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియమితులైన రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు తమకు కేటాయించిన డివిజన్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ సూచించారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు డివిజన్ల వారీగా రూట్ మ్యాప్‌లు, పోలింగ్ కేంద్రాల వివరాలపై స్పష్టమైన అవగాహన అవసరమని కమిషనర్ పేర్కొన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, డీసీపీ కె.వి. కృష్ణారావు ఎన్నికల విధులకు నియమితులైన అధికారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆయా రిటర్నింగ్ అధికారులకు కేటాయించిన డివిజన్ల రూట్ మ్యాప్‌లను వివరించి, సంబంధిత ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, మార్గాలు, పోలింగ్ కేంద్రాల వివరాలను తెలియజేశారు. ప్రతి అధికారి తమ పరిధిలోని డివిజన్లపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వాటికి చేరుకునే మార్గాలు, ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన సమాచారంపై ముందస్తు సిద్ధత కలిగి ఉండాలని సమావేశంలో వివరించారు. ఎన్నికల నిర్వహణ సమయంలో సమన్వయంతో పనిచేస్తూ, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించాలని కమిషనర్ సత్యనారాయణ సూచించారు.

పాలనను బేరీజు వేసుకుని ఓటర్లు నిర్ణయం తీసుకోవాలి : డాక్టర్ సత్తి



అనపర్తి , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): గత ప్రభుత్వంలో అమలైన సంక్షేమ పథకాలను, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనను బేరీజు వేసుకుని ఓటర్లు సరైన నిర్ణయం తీసుకోవాలని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి కోరారు. పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ...స్థానిక సంస్థలకు జరగనున్న ఎన్నికల నేపథ్యంలో అనేక ఒత్తిళ్లు వచ్చినప్పటికీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు ధైర్యంగా ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. అభ్యర్థు లందరూ ప్రచారంలో ముందంజలో ఉండటం అభినందనీయమన్నారు. ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లినప్పుడు అభ్యర్థులు ఓటర్లకు గత వైఎన్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో అమలైన సంక్షేమ పథకాలకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని పక్కన పెట్టిన విధానానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా వివరించాలని సూచించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో అమలైన సంక్షేమ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం పక్కన పెట్టేసిందని విమర్శించారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ సమయంలోనే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయని ఆందోళన వ్యక్తం చేశారు. బియ్యం, పంచదార, నూనె, పప్పు ధాన్యాలు మొదలుకొని ఏ షాపునకు వెళ్లి ధర అడిగినా సామాన్యుడికి షాక్ కొట్టే పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాలను, దాడులను కూడా ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని అభ్యర్థులను కోరారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, గడపగడపకూ వెళ్లి ప్రభావవంతంగా క్యాంపెయినింగ్ నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆత్రేయపురం మండలంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శ్రీధర్ విస్తృత ప్రచారం



రావులపాలెం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): ఆత్రేయపురం మండల వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ అభ్యర్థి కప్పల శ్రీధర్ ఆదివారం మండలంలోని బొబ్బర్లంక, రాజవరం,ఇతర గ్రామాల్లో తన అనుచరులతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలను కలుసుకుని తనకు, పార్టీ ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని పేర్కొన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజలకు సేవ చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆశీస్సులతో వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు.ఈ ఎన్నికల్లో తనతో పాటు మండలంలోని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థులకు కూడా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కొల్లి శ్యామ్, నాని, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సరోజిని ధర్మారెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారం

అనపర్తి , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): అనపర్తి 1 ఎంపీటీసీ స్థానానికి వైకాపా అభ్యర్థిని గొలుగూరి సరోజిని ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. గాంధీనగర్, శాంతిపురం, పల్లీల పేట, ఐ ఎల్ టి డి వర్కర్స్ యూనియన్ ఆఫీస్ ఏరియా తదితర ప్రాంతాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీటీసీ అభ్యర్థిని గొలుగూరి సరోజిని ధర్మారెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గ వైకాపా సమన్వ యకర్త మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు నిస్వార్థ సేవలు అందిస్తామన్నారు. అభివృద్ధి,సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. మేడపాటి రామకృష్ణారెడ్డి, సత్తి రామారెడ్డి, కర్రి సుధాకరరెడ్డి, మేడపాటి శివ శంకరరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, మేడపాటి వెంకటరమణారెడ్డి, వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుతో పీజీఆర్ఎస్ తాత్కాలిక నిలిపివేత



రాజమహేంద్రవరం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున తూర్పుగోదావరి జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని డిసెంబరు 2, 2026 వరకు లేదా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు, ఏది ముందుగా జరిగితే అప్పటివరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, అధికారుల పర్యవేక్షణ, ఎన్నికల విధుల నిర్వహణ తదితర అంశాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు విధులు నిర్వహించాలని, ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం సంబంధిత ఆదేశాల మేరకు పీజీఆర్ఎన్ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి క్లీన్ స్వీప్ చేయాలి : ఎమ్మెల్యే నల్లమిల్లి



అనపర్తి , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు 100 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించాలని అనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.అనపర్తి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నుండి స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేస్తున్న కూటమి జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల పరిచయ, సన్నాహక సమావేశం ఆదివారం అనపర్తిలోని ఎస్ ఎన్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో పాటు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి, జనసేన ఇన్‌చార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ...గత వైసీపీ పాలనలో అనపర్తి నియోజకవర్గం అభివృద్ధిలో ఏ విధంగా వెనుకబడిపోయిందో ప్రజలకు స్పష్టంగా వివరించాలన్నారు. గడిచిన రెండేళ్ల కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి సమన్వయ కమిటీల ద్వారా ఓటర్లను భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులంతా పూర్తి ఐక్యమత్యంతో, ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగుతూ విజయమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు.స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి వైసీపీకి సరైన అభ్యర్థులు లేరని, కనీసం అభ్యర్థులను ప్రకటించే సాహసం కూడా ఆ పార్టీ చేయలేకపోతుందని విమర్శించారు. కూటమి అభ్యర్థుల విజయం ఇప్పటికే ఖాయమైందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

అనపర్తిలో ఆధ్యాత్మిక ప్రవాహకులకు సత్కారం



అనపర్తి , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): వీరుళ్ళమ్మ ఓం శక్తి సత్సంగం మూడు దశాబ్దాలకు పైగా అనపర్తి పరిసర ప్రాంతాలలో ప్రవచనాలు ద్వారా ప్రజలలో భక్తి భావాలను పెంపొందించడంలో ఓం శక్తి సత్సంగం అధ్యక్షులు మేడపాటి వెంకటరమణారెడ్డి (గురు భవాని), సత్తి రామారెడ్డి ల కృషి అభినందనీయమని వ్యాపారవేత్త కర్రి సుధాకర్ రెడ్డి అన్నారు.స్థానిక వీరుళ్ళమ్మ ఆలయ సన్నిధిలో త్రిశక్తి పీఠం నిర్వాహకులు మేడపాటి రామకృష్ణారెడ్డి,శివ శంకరరెడ్డి ల ఆధ్వర్యంలోఆదర్శ రైతు స్వర్గీయ నల్లమిల్లి రామారెడ్డి భార్య చెల్లయమ్మ , కొత్తూరు గ్రామానికి చెందిననత్తి ఆదిరెడ్డి అరుణ దంపతులు,చిరంజీవి హేమసాత్విక చేతుల మీదుగా అమ్మవారికి వివిధ ఫల పుష్పాలతో పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆధ్యాత్మిక భక్తి గీతాలతో ఆలయ పరిసర ప్రాంతం ఆధ్యాత్మిక శోభ సంతరిం చుకుంది. ఆధ్యాత్మిక భక్తులు గొలుగూరి సహదేవారెడ్డి విజయలక్ష్మి దంపతులు, ఉత్తమ ఉపాధ్యాయ వార్డు గ్రహీత దాసరి నాగమణి చిట్టిబాబు దంపతులు, సత్సంగ ప్రతినిధులు కర్రి శ్రీనివాసరెడ్డి, మణికంఠ, మహేష్, హనుమాన్, బాపిరెడ్డి,నాని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సైకిల్ గుర్తుకే మన ఓటు..ఓటర్లను అభ్యర్థించిన కర్రి శేషారత్నం

అనపర్తి , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): పరిషత్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగియడంతో అనపర్తి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థుల ప్రచార పర్వం ఊపందుకుంది. అనపర్తి ఎంపీటీసీ-6 స్థానానికి కూటమి మద్దతుతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కర్రి శేషారత్నం తన పరిధిలోని ఓటర్లను కలుసుకుని ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.గ్రామాల్లోని మహిళలను, పెద్దలను వ్యక్తిగతంగా కలుస్తూ కూటమి ప్రభుత్వ అభివృద్ధి నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాము ఓట్లు అడుగుతున్నామని ఈ సందర్భంగా అభ్యర్థి పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటర్లందరూ తమ అమూల్యమైన ఓటును 'సైకిల్' గుర్తుపై వేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె ప్రార్థించారు.

కంబాల చెరువు సెంటర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

- రాబోయేది హిందూ శతాబ్దం..
2047 నాటికి సరికొత్త
భారత వైభవం: అప్పాల ప్రసాద్
- రాయగడ నుంచి ప్రత్యేక
జ్యోతి రాక.. ఉదయం శాంతిహోమం..
డోల్‌తాషా వాయిద్యాల
నడుమ అట్టహాసంగా వేడుకలు



రాజమహేంద్రవరం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): స్వాతంత్ర్యం సిద్ధినుంచి 2047నాటికి వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో అనే వచ్చేది హిందూ శతాబ్దమని సమరసత సేవా సమితి తెలుగు రాష్ట్రాల కార్య దర్శి అప్పాల ప్రసాద్ అన్నారు. మన ఇంటివరకే కులమని, బయటకు వస్తే అంతా హిందువుల మని భావించాలని ఆయన సూచించారు. హిందూ ధర్మ రక్షకుడు, హిందూ సామ్రాజ్య స్థాపకుడు చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ ఆదివారం సాయంత్రం కంబాల చెరువు సెంటర్ లో మహారాష్ట్ర సాంప్రదాయ డోర్ తాషా వాయిద్యాలనడుమ ఆవిష్కరించారు. జై భవాని, వీర శివాజీ నినాదాల నడుమ సాగిన ఈ వేడుక సందర్భంగా శ్రీరామ ఉత్సవ సమితి అధ్యక్షులు పతివాడ రామరాజు అధ్యక్షతన ఏర్పాటైన సభలో అప్పాల ప్రసాద్ ముఖ్యవక్తగా పాల్గొన్నారు. జిజియా మాత కోరిక మేరకు పరమ శివుడు ప్రసాదించిన శివాజీ ఆనాటి ఔరంగజేబు నిరంకుశ దమనకాండకు వ్యతిరేకంగా దండెత్తాడని అప్పాల ప్రసాద్ అన్నారు. 1630లో జన్మించిన శివాజీ 1974లో పట్టాభిషిక్తుడయ్యాడని చిన్నవయస్సు నుంచే తన పరాక్రమం శివాజీ చూపించాడని ఆయన పేర్కొన్నారు. నౌకా నిర్మాణ రూపశిల్పి శివాజీ అని ఆయన కొనియాడారు. శివాజీ వారసులుగా పరాక్రమ వంతులుగా తయ్యారవ్వాలని ఆయన పిలుపు నిచ్చారు. గోదావరి పుష్కరాలు రానున్న నేపథ్యంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఇక్కడ ఆవిష్కరించుకోవడం అభినంద నీయమని అన్నారు. ప్రపంచానికి బట్ట కట్టడం నేర్పిన భారతదేశం, ధనియాలు, మిరియాలు మొదలుకుని ఎన్నింటినో ఎగుమతి చేసిందని ఆయన ప్రస్తావిస్తూ, దండయాత్రల కారణంగా 350ఏళ్ళు బానిస పాలనలో మగ్గాల్సి వచ్చిందని ఆయన అన్నారు. ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి తిండిగింజలు కూడా లేని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడామని, ఇప్పుడు పూర్వ వైభవం సాధిస్తూ ప్రపంచంలో నాల్గవ ఆర్థిక శక్తిగా ఎదిగామని అప్పాల ప్రసాద్ పేర్కొన్నారు. అనంతరం విగ్రహాన్ని రిమోట్ ద్వారా ఆయన ఆవిష్కరించారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన ఎమ్మెల్యే సుహాస్ అనీల్‌రావు బాబర్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ వేడుక చూస్తుంటే, తాను మహారాష్ట్రలోని ఉన్నట్లుగా ఉందన్నారు. ఛత్రపతి శివాజీ శ్రీశైలం వచ్చాడని ఆయన గుర్తుచేస్తూ, అందుకే శివాజీకి ఆంధ్రప్రదేశ్ తో అనుబంధం ఉందన్నారు. శ్రీరామ ఉత్సవ సమితి అధ్యక్షుడు పతివాడ రామరాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకోసం చేస్తున్న ప్రయత్నం ఫలించి,ఇప్పటికి కార్యరూపం దాల్చిందని అన్నారు. ఆర్ సుబ్బరాజు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉదయం సమితి కార్యదర్శి యడ్లపల్లి అయ్యప్ప స్వామి దంపతుల సారధ్యంలో శివాజీ విగ్రహ చెంతన శాంతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం శివాజీ మహారాజ్ జన్మించిన మహారాష్ట్ర రాయగడ నుండి ప్రత్యేకంగా తీసుకు జ్యోతిని దేవి చౌక్ అమ్మవారి పాదాల వద్ద ఉంచి అక్కడినుంచి సభాస్థలి వద్దకు తీసుకొచ్చారు. పలువురు ప్రముఖులు, శ్రీరామ ఉత్సవ సమితి కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్ల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలి



రావులపాలెం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్ల వద్ద పటిష్ట భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. మహేష్ కుమార్ రావిరాల అధికారులను ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి భద్రతతో పాటు ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

నామినేషన్లు, అప్పీళ్లపై అధికారులతో సమీక్ష

కొత్తపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో దాఖలైన ఎంపీటీసీ నామినేషన్లు, వివిధ కారణాలతో తిరస్కరణకు గురైన నామినేషన్లు, వాటికి సంబంధించి దాఖలైన అప్పీళ్లు తదితర అంశాలపై కొత్తపేట రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివరాలను సమీక్షించి, నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు.

స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్ల క్షేత్రస్థాయి పరిశీలన

అనంతరం కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లు, భద్రతా ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలను కలెక్టర్ ఆదివారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాలకు సంబంధించి కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి మండలాలకు సంబంధించి కొత్తపేటలోని వి.కె.వి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్ల వద్ద సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, ఎన్నికల నియమావళిని తు.చ. తప్పకుండా పాటించాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ, లోపాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి జి.వి.వి. సత్యనారాయణ, రోడ్లు మరియు భవనాల శాఖ జిల్లా అధికారి బి. రాము, సబ్ డివిజనల్ పోలీసు అధికారి ఎస్. మురళీ మోహన్, డి.ఎల్.డి.ఓ సురేష్ కుమార్, కొత్తపేట తహసీల్దార్ వై. రాంబాబు, ఎంపీడీఓ పి. కృష్ణారెడ్డి, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుఫాను హెచ్చరిక నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

డివిజన్‌లో 14 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు : సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్



రాజమహేంద్రవరం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫానుగా బలపడే అవకాశం ఉన్న నేపథ్యంలోరాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈనెల 26వ తేదీ ఉదయానికి తుఫానుగా, 27వ తేదీ ఉదయానికి తీవ్ర తుఫానుగా, అదే రోజు రాత్రికి అతి తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందన్నారు. 28వ తేదీ ఉదయం బాపట్ల--విశాఖపట్నం మధ్య ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశం ఉందని, ఈ సమయంలో గంటకు 115--125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉందని, అప్పుడప్పుడు గాలి వేగం గంటకు 140 కిలోమీటర్ల వరకు చేరవచ్చని పేర్కొన్నారు. ప్రజలు వాతావరణ శాఖ జారీ చేసే తాజా హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని, తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని సబ్ కలెక్టర్ కోరారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలు మేరకు డివిజన్ పరిధిలో ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన చోట్ల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.అత్యవసర సేవల సిబ్బందిని సిద్ధంగా ఉంచడంతోపాటు, ప్రజలకు అవసరమైన నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని శుభం నోక్వాల్ పేర్కొన్నారు.తుఫాను పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని 13 మండలాల తహశీల్దార్ కార్యాలయాలతోపాటు సబ్ కలెక్టర్ కార్యాలయంలో అక్టోబరు 25 నుంచి 29వ తేదీ వరకు 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుఫానుకు సంబంధించిన సమాచారం, అత్యవసర పరిస్థితులు, ఇతర సమస్యలపై ప్రజలు ఈ కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని సూచించారు.

24 X 7 కంట్రోల్ రూమ్ నెంబర్ లు

సబ్ కలెక్టర్ కార్యాలయం, రాజమహేంద్రవరం కంట్రోల్ రూమ్ ఫోన్ నంబరు 0883-2442344;

తహసిల్దార్ కార్యాలయాల్లో..

అనపర్తి 9441386920,

బిక్కవోలు 8886781584,

గోకవరం 9491385060,

కడియం 9490884561,

కోరుకొండ 9154474851

రాజమహేంద్రవరం రూరల్ 9966058666,

రాజమహేంద్రవరం అర్బన్

0883-2940695,

రాజానగరం 9393650402,

రంగంపేట 9393931667,

సీతానగరం 7032310130,

మండపేట 9989626869,

రాయవరం 9618006344,

కపిలేశ్వరపురం 9848149625

నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. తుఫాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారులకు వెంటనే సమాచారం అందించాలని సబ్ కలెక్టర్ సూచించారు. అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు.

పట్టణం 23వ వార్డులో హోరెత్తిన యువనాయకులు కరణ్ కూటమి ఎన్నికల ప్రచార జోరు



అమలాపురం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తనయుడు, యువనాయకులు కరణ్ 23వ వార్డు పరిధిలోని బుచ్చెమ్మ అగ్రహారం మరియు కుమ్మర్ల వీధుల్లో నిర్వహించిన క్షేత్రస్థాయి ఇంటింటి ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జనసేన పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్ గాజు గ్లాస్ గుర్తుకు, అలాగే తెలుగుదేశం పార్టీ 23వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి చిక్కాల లక్ష్మి సైకిల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని స్థానిక పట్టణ ప్రజలను కోరారు. వార్డు ప్రజలందరూ కూటమి అభ్యర్థులను ఆశీర్వదించి విజయంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రంలో చేతులెత్తేసిన వైసిపి
జనసేనలో చేరిన పుణ్యక్షేత్రం వైసిపి యువ నాయకులు



రాజానగరం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): రాజానగరం నియోజక వర్గంలో రోజూ వైసీపీకి భారీ షాకులు తగులుతున్నాయి.స్థానికసంస్థల ఎన్నికల ముందు పుణ్యక్షేత్రంలో వైసీపీ చేతులెత్తేసింది.రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సమక్షంలో రాజానగరం మండలం, పుణ్యక్షేత్రం గ్రామానికి చెందిన పలువురు వైసిపి ముఖ్య యువ నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు.జనసేన పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.పార్టీలో చేరిన యువ నాయకులకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ జనసేన కండువాలుప్పి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని, పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, ప్రాధాన్యం ఉంటాయని హామీ ఇచ్చారు. పుణ్యక్షేత్రం గ్రామంలో జనసేన పార్టీకి యువత చేరికతో మరింత బలం చేకూరిందని హర్షం వ్యక్తం చేశారు.జనసేన పార్టీలో చేరిన వారిలో వేపకాయల సాయిబాబు, వేపకాయల సూరిబాబు, కంఠంశెట్టి దొరబాబు, వేపకాయల మణికంఠ (బాబీ), వేపకాయల వెంకటరమణ, వేపకాయల వీర ప్రసన్నకుమార్ (నాని), నర్రావుల నాగేశ్వర రావు, గుర్రాల మణికంఠ, ఇతర యువ నాయకులు, మద్దతుదారులు ఉన్నారు.పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నాయకత్వంలో జనసేన పార్టీని మరింత క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు, గ్రామాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇరిపాక ఎంపీటీసీ అభ్యర్థి సుర్ల అప్పారావుకు బ్రహ్మరథం
జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ ఆశీస్సులతో ఇంటింటా ప్రచారం

జగ్గంపేట , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇరిపాక గ్రామ ఎంపీటీసీ అభ్యర్థిగా జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు గౌరవ జ్యోతుల నెహ్రూ , కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆశీస్సులతో కూటమి పార్టీల బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుర్ల అప్పారావు శనివారం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను కలిసి తమకు ఓటు వేసి ఎంపీటీసీగా గెలిపించాలని అభ్యర్థించారు. తెలుగుదేశం పార్టీకి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎంపీటీసీగా గెలిపిస్తే ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గారి సహకారంతో ఇరిపాక గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని, గ్రామంలో ఉన్న సమస్యలన్నింటినీ ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని తెలిపారు.జగ్గంపేట జడ్పిటిసి అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ నుండిపోటీ చేస్తున్న జీను మణిబాబుకి సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అన్నారు. రెండు ఓట్లు ఇస్తారని రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేసి గెలిపించాలని అన్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ బస్వా చిన్న బాబు, టిడిపి సీనియర్ నాయకులు పంతం సత్యనారాయణ, జ్యోతుల నాగబాబు, జ్యోతుల సత్యమూర్తి, పంతం తమ్మి రాజుబాబు, కొండ్రపు సూరిబాబు, కోనేటి వెంకటేశ్వరరావు, జ్యోతుల బాబ్జి కూటమి నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాజమండ్రిలో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ



రాజమహేంద్రవరం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): స్వాతంత్ర్యం సిద్ధినుంచి 2047నాటికి వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో వచ్చేది హిందూ శతాబ్దమని సమరసత సేవా సమితి తెలుగు రాష్ట్రాల కార్యవాహ్ అప్పాల ప్రసాద్ అన్నారు. మన ఇంటివరకే కులమని, బయటకు వస్తే అంతా హిందువులమని భావించాలని ఆయన సూచించారు. హిందూ ధర్మ రక్షకుడు, హిందూ సామ్రాజ్య స్థాపకుడు చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ ఆదివారం సాయంత్రం కంబాల చెరువు సెంటర్ లో మహారాష్ట్ర సాంప్రదాయ డోర్ తాషా వాయిద్యాలనడుమ ఆవిష్కరించారు. జై భవాని, వీర శివాజీ నినాదాల నడుమ సాగిన ఈ వేడుక సందర్భంగా శ్రీరామ ఉత్సవ సమితి అధ్యక్షులు పతివాడ రామరాజు అధ్యక్షతన ఏర్పాటైన సభలో అప్పాల ప్రసాద్ ముఖ్యవక్తగా పాల్గొన్నారు.జిజియా మాత కోరిక మేరకు పరమ శివుడు ప్రసాదించిన శివాజీ ఆనాటి ఔరంగజేబు నిరంకుశ దమనకాండకు వ్యతిరేకంగా దండెత్తాడని అప్పాల ప్రసాద్ అన్నారు. 1630లో జన్మించిన శివాజీ 1974లో పట్టాభిషిక్తుడయ్యాడని చిన్నవయస్సు నుంచే తన పరాక్రమం శివాజీ చూపించాడని ఆయన పేర్కొన్నారు. నౌకా నిర్మాణ రూపశిల్పి శివాజీ అని ఆయన కొనియాడారు. శివాజీ వారసులుగా పరాక్రమ వంతులుగా తయ్యారవ్వాలని ఆయన పిలుపు నిచ్చారు. గోదావరి పుష్కరాలు రానున్న నేపథ్యంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఇక్కడ ఆవిష్కరించుకోవడం అభినంద నీయమని అన్నారు. ప్రపంచానికి బట్ట కట్టడం నేర్పిన భారతదేశం, ధనియాలు, మిరియాలు మొదలుకుని ఎన్నింటినో ఎగుమతి చేసిందని ఆయన ప్రస్తావిస్తూ, దండయాత్రల కారణంగా 350ఏళ్ళు బానిస పాలనలో మగ్గాల్సి వచ్చిందని ఆయన అన్నారు. ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి తిండిగింజలు కూడా లేని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడామని, ఇప్పుడు పూర్వ వైభవం సాధిస్తూ ప్రపంచంలో నాల్గవ ఆర్థిక శక్తిగా ఎదిగామని అప్పాల ప్రసాద్ పేర్కొన్నారు. అనంతరం విగ్రహాన్ని రిమోట్ ద్వారా ఆయన ఆవిష్కరించారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన ఎమ్మెల్యే సుహాస్ అనీల్‌రావు బాబర్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ వేడుక చూస్తుంటే, తాను మహారాష్ట్రలోని ఉన్నట్లుగా ఉందన్నారు. ఛత్రపతి శివాజీ శ్రీశైలం వచ్చాడని ఆయన గుర్తుచేస్తూ, అందుకే శివాజీకి ఆంధ్రప్రదేశ్ తో అనుబంధం ఉందన్నారు. శ్రీరామ ఉత్సవ సమితి అధ్యక్షుడు పతివాడ రామరాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకోసం చేస్తున్న ప్రయత్నం ఫలించి,ఇప్పటికి కార్యరూపం దాల్చిందని అన్నారు. ఆర్ సుబ్బరాజు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉదయం సమితి కార్యదర్శి యడ్లపల్లి అయ్యప్ప స్వామి దంపతుల సారధ్యంలో శివాజీ విగ్రహ చెంతన శాంతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం శివాజీ మహారాజ్ జన్మించిన మహారాష్ట్ర రాయగడ నుండి ప్రత్యేకంగా తీసుకు జ్యోతిని దేవి చౌక్ అమ్మవారి పాదాల వద్ద ఉంచి అక్కడినుంచి సభాస్థలి వద్దకు తీసుకొచ్చారు. పలువురు ప్రముఖులు, శ్రీరామ ఉత్సవ సమితి కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పై అవగాహనా కల్పించిన కాకినాడ ట్రాఫిక్ -1 పోలీసులు



కాకినాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): ఆదివారం కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపిఎస్., ఆదేశాల మేరకు మరియు అడిషనల్ ఎస్పీ డాక్టర్ ఎం కిషోర్ కుమార్ పర్యవేక్షణలో , కాకినాడ కల్పనా సెంటర్ వద్ద ట్రాఫిక్ రూల్స్ పైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ట్రాఫిక్ రూరల్స్ పై అవగాహనలో భాగంగా: హెల్మెట్ యొక్క ఆవశ్యకతను వివరిస్తూ, మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, యువత వాహనాలను అతివేగంగా నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయనిలి, వాహనం నడుపు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మైనర్ డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాల బారిన పడి, తల్లిదండ్రులకు తీరని సోకాన్ని మిగులుస్తున్నారని, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్ వలన వాహన సామర్థ్యం కోల్పోయి రోడ్ ప్రమాదములు ఎక్కువగా జరుగుతున్నాయని,లి డ్రంక్ అండ్ డ్రైవ్ చేసి వాహనం నడపడం వలన ఎక్కువ మంది రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలను కోల్పోతున్నారని మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం వలన రోడ్డు ప్రమాదాలు బారిన పడుతున్నారని, కాకినాడ పట్టణం నందు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రెడ్ లైట్ పడిన అనంతరం, జిబ్రా లైన్స్ వద్ద మాత్రమే రోడ్ దాటవలెనని, రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో సహాయం చేసిన వారికి "గుడ్ సమారిటెన్ క్రింద 25,000/- నగదు బహుమతి కలెక్టర్ చేతుల మీదుగా ఇవ్వబడునని, 1,50,000 వరకు రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత ఉచిత చికిత్స చేయబడునని అవగాహన కల్పించారు. ఈ యొక్క కార్యక్రమం నందు ట్రాఫిక్ -1 ఇన్స్పెక్టర్ ఎన్. రమేష్ మరియు ట్రాఫిక్ సిబ్బంది, పాల్గొన్నారు.

"స్టాప్ వాష్ అండ్ గో" నిర్వహించిన కాకినాడ పోలీస్‌లు



కాకినాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపీఎస్ వారు ఆదేశాల ప్రకారం, ఎం . కిషోర్ కుమార్ అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) వారి సారధ్యంలో 24/25 వ తేదిన, కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ యన్. రమేష్, మరియు సిబ్బంది తో రహదారి ప్రమాదాల నివారణకు, రాత్రి సమయం లో ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు.లి ఈ సందర్భంగా రాత్రి పూట మరియు తెల్లవారు జామున డ్రైవింగ్ చేసే వాహనదారులు అలసట/నిద్ర మత్తు వలన ప్రమాదాలకు గురి కాకుండా ఉండేందుకు "స్టాప్ వాష్ అండ్ గో" (ఫేస్ వాష్ మరియు డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమములు) నిర్వహించారు. వాహనదారులకు నిద్ర మత్తులో డ్రైవింగ్ ఎంత ప్రమాదకరమో వివరించి, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు .రహదారి ప్రమాదాల నివారణ కొరకు ప్రజలు పాటించవలసిన ముఖ్య సూచనలు: నిద్ర మత్తులో డ్రైవింగ్ చేయరాదని, డ్రైవింగ్ ప్రారంభించే ముందు తగిన విశ్రాంతి తీసుకోవాలని .అధిక వేగం, రాష్ ఢ నెగ్లెజెన్స్ గా వాహనాలు నడపకూడదని , వేగం తగ్గిస్తే మీ ప్రాణాలు, మరియు ఇతర ప్రాణాలు కాపాడు కోవచ్చని, హెల్మెట్ ఢ సీట్‌బెల్ట్ తప్పనిసరి ధరించి వాహనం నడపాలని , చిన్న పాటి దూరం మే కదాని, మీ ప్రయానమును/వాహనం ను వన్ వే లో వెళ్ళవద్దనిలి మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదనిలి నీపై మీ కుటుంబం ఆధారపడి ఉందని గుర్తించండి, ట్రాఫిక్ రూల్స్ పాటించండి సురక్షతం గా మీ గమ్యాని చేరండి అని అవగాహన కల్పించినారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులకు గురు బ్రహ్మ స్టేట్ 2026 అవార్డు

కాకినాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): కాకినాడ జిల్లా నుండి 2026 సంవత్సరంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన అద్దంకి వెంకన్న బాబు మరియు డాక్టర్ డి వాణి ప్రభ కు మదర్ తెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విశాఖపట్నం వారు ఆదివారం నాడు కాకినాడ గాంధీనగర్ లో జరిగిన కార్యక్రమంలో గురు బ్రహ్మ స్టేట్ అవార్డ్ 2026 ను అందజేయడం జరిగింది. సామర్లకోట మండలం కాపవరం ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న అద్దంకి వెంకన్న బాబు మరియు పత్తిపాడు మండలం లంపకలోవ జిల్లా పరిషత్ పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న డాక్టర్ డి వాణి ప్రభు కు వారి సేవలను గుర్తించి అవార్డు అందజేయడం జరిగిందని నిర్వాహకులు తెలియజేయడం జరిగింది.

కొచ్చి డ్రగ్స్ కేసు పై ఎందుకీ అబద్ధాలు..?



కాకినాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): కొచ్చిలో పట్టుబడిన డ్రగ్స్ వ్యవహారంలో రాజకీయ లబ్ధి కోసం నిరాధారమైన తప్పుడు ఆరోపణలు చేస్తే ఉపేక్షించేది లేదని వైయస్ఆర్సీపీ కాకినాడ సిటీ కోఆర్డినేటర్,మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. డ్రగ్స్ కేసులో తనకు సంబంధం ఉందంటూ కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ పదేపదే నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం అయన విలేకరులతో మాట్లాడుతూ అబద్దాల కొండబాబుకు ఇప్పుడు పంతం నానాజీ తోడయ్యారని విమర్శించారు. ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పి నిజమని నమ్మించేలా వీరిద్దరూ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రోకళ్ళ సత్యనారాయణ తో కలిసి తాను ఐవరి కోస్ట్ ప్రయాణించానంటూ పంతం నానాజీ చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇమిగ్రేషన్ అధికారుల వద్ద ఇందుకు సంబంధించిన ఆధారాలు రికార్డులు ఉన్నాయని పంతం నానాజీ చేసిన ఆరోపణలపై ఆయన మండిపడ్డారు. తానెప్పుడు రోకళ్ళ సత్యనారాయణతో కలిసి విదేశీ పర్యటనలు చేయలేదని, కావాలంటే తన పాస్పోర్ట్ ఇస్తానని, ఇమిగ్రేషన్ అధికారుల ద్వారానో... ఇతర మార్గాల ద్వారానో విచారణ చేసుకోవచ్చని సవాల్ చేశారు. పదేపదే తప్పుడు ఆరోపణలు చేయడం మానుకుని కాకినాడ సిటీ రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు ,పంతం నానాజీలు ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు వెళ్లి కొచ్చి డ్రగ్స్ కేసు విషయమై సిబిఐ విచారణ జరిపించాల్సిందిగా కోరగలరా? అని ప్రశ్నించారు. ఆ విచారణలో తనపై వచ్చిన ఆరోపణలు రుజువు చేయలేకపోతే రాజకీయాలనుంచి తప్పుకోవాలని , ఆరోపణల్లో ఏమాత్రం నిజం ఉన్నట్లు తేలినా తాను రాజకీయాలను వదిలేస్తానని ద్వారంపూడి మరోసారి స్పష్టం చేశారు. చంద్రబాబు వద్దకు వెళ్లి సిబిఐ విచారణ కోరలేని ఈ ఎమ్మెల్యేలు తనపై అవాకులు చావాకులు పేలితే ఏమాత్రం సహించబోనని హెచ్చరించారు.

తుఫాన్ హెచ్చరికలు నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి



కాకినాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): ఆర్నాబ్ తుఫాన్ హెచ్చరిక లు నేపథ్యంలో కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి. ఎస్ మల్లిబాబు తహసీల్దార్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 27 28వ తేదీ నాటికి తుఫాను తీవ్ర రూపం దాల్చి కాకినాడ వద్ద తీరం దాటవచ్చన్న హెచ్చరికల నేపథ్యంలో రెవెన్యూ పంచాయతీ పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామస్థాయిలో ప్రజానీకాన్ని ఎప్పటికప్పుడు చేయాలని ముఖ్యంగా తీర ప్రాంతం మండలాలైన ఉప్పాడ, కొత్తపల్లి. కాకినాడ రూరల్. కాకినాడ అర్బన్ మరియు కరప తాళ్ళరేవు మండలాల్లో సిబ్బంది కంట్రోల్ రూమ్ ఓపెన్ చేసి నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యంగా ఈదురు గాలులకు చెట్లు విరిగిన నేపథ్యంలో అవసరమైన రంపం మిషన్లు అగ్నిమాపక సిబ్బంది వద్ద అందుబాటులో ఉంచడమైనదని. ముఖ్యంగా త్రాగునీరు ఆసుపత్రులు మొబైల్ టవర్లకు అవసరమైన చమురు నిలవలు సిద్ధం చేసుకోవాలని, మండలాల్లో గల ప్రభుత్వ స్కూళ్లను తమ ఆధీనంలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఆహారం. ఆదేశించారు. త్రాగునీరు విద్యుత్ సౌకర్యాలకు ఆటంకం లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు ఎటువంటి విపత్కర పరిస్థితి నైనా ఎదుర్కొనేందుకు నన్నద్ధంగా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

కిరండూల్ పాసింజర్‌కు అదనపు స్లీపర్ కోచ్

విశాఖపట్నం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): పర్యాటకుల సౌకర్యార్థం విశాఖ-కిరండూల్ పాసింజర్ సర్వీసులకు తాత్కాలిక అదనపు స్లీపర్ కోచ్‌ను జత చేస్తున్నామని రైల్వే అధికారులు ప్రకటించారు. విశాఖ-కిరండూల్ పాసింజర్‌కు (58501) ఈ నెల 26 నుంచి 28 వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ పాసింజర్‌కు (58502) ఈ నెల 29 నుంచి నవంబరు 8 వరకు అదనపు స్లీపర్ కోచ్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- జాతీయ రహదారి, ఇతర ప్రధాన రహదారులపైకి వేలాడుతున్న కొమ్మలు
- పట్టించుకోని జీవీఎంసీ ఉద్యానవన విభాగం

విశాఖపట్నం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): బంగాళాఖాతంలో ఉన్న వాయుగుండం తుఫాన్‌గా మారనున్నందున సోమవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు తీవ్రమైన గాలులు వీయడంతో పాటు భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వార్తలు వస్తుండడంతో నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి తరుణంలో జాతీయ రహదారి, ఇతర ప్రధాన రహదారుల వెంబడి ఉన్న భారీవృక్షాల కొమ్మలు ప్రస్తుతం రోడ్డుపైకి వేలాడుతుండడంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడపతున్నారు. నగరంలో పచ్చదనం కోసం జాతీయ రహదారితోపాటు ఇతర ప్రధాన రహదారుల వెంబడి పెద్దసంఖ్యలో మొక్కలు నాటారు. అవన్నీ ఇప్పుడు భారీవృక్షాలై కాలుష్య తీవ్రతను తగ్గించడానికి దోహదపడుతున్నాయి. అయితే ప్రధాన రహదారుల వెంబడి ఉన్న భారీవృక్షాల కొమ్మలను కనీసం ఏడాదికి ఒకసారైనా ట్రిమ్మింగ్ చేయాలి. ఆ బాధ్యతను జీవీఎంసీ పూర్తిగా విస్మరించింది. దీనివల్ల కొమ్మలు రోడ్లపైకి వేలాడుతూ వచ్చిపోయే వాహనాల పైకప్పులకు తగులుతున్నాయి. ఎప్పుడైనా చిన్నపాటిగాలులు వీస్తే విరిగి రోడ్లపై పడుతున్నాయి. ఆ సమయంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలగడంతోపాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఒక్కోసారి ప్రాణనష్టం కూడా సంభవిస్తోంది. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే జీవీఎంసీ అధికారులు ఏటా ఏదో ఒక సీజన్‌లో చెట్ల మనుగడకు ఇబ్బంది తలెత్తకుండా శాస్త్రీయ పద్ధతిలో కొమ్మలను కత్తిరించాల్సి ఉంటుంది. అలాచేస్తే వర్షాలు కురిసినప్పుడు, గాలులు వీచినప్పుడు కొమ్మలు విరిగిపడే పరిస్థితి రాదు. పొరుగున ఉన్న ఒడిశా రాష్ట్రంలో ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో రోడ్ల వెంబడి ఉండే చెట్లకు ట్రిమ్మింగ్, ప్రూనింగ్ వంటి ప్రక్రియలను పూర్తిచేస్తుంటారు. ఈ చర్య మంచి ఫలితాలను ఇస్తోంది. జీవీఎంసీ పరిధిలో కూడా చెట్లను పరిరక్షించడం, పచ్చదనం పెంచడం, నగర సుందరీకరణ వంటి బాధ్యతలను నిర్వర్తించేందుకు హార్టికల్చర్ విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. కానీ ఆ విభాగం సిబ్బంది ఎక్కడ చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడిపోతాయో అక్కడకు వెళ్లి వాటిని తొలగించడానికి మాత్రమే పరిమితమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని సందర్భాల్లో వీధి లైట్లకు అడ్డుగా చెట్టుకొమ్మలు ఉంటున్నాయని, జీవీఎంసీ ఎలక్ట్రికల్ విభాగం సిబ్బంది లేదా స్థానికులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వాటిని తొలగిస్తున్నారు. అంతేగానీ ఏటా రోడ్ల వెంబడి ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంపై దృష్టిపెట్టడం లేదు. తాజాగా తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలోనైనా జీవీఎంసీ హార్టికల్చర్ విభాగం అధికారులు ముందుజాగ్రత్తగా జాతీయ రహదారితోపాటు ప్రధాన రహదారుల వెంబడి వేలాడుతున్న చెట్ల కొమ్మలను తొలగించాలని నగరవాసులు కోరుతున్నారు.

తుఫాన్‌తో అప్రమత్తం.. నేడు జిల్లాలో అధికారులతో కలెక్టర్ వెబెక్స్

12 జిల్లాల్లో ఈపీడీసీఎల్ కంట్రోల్ రూమ్‌లు

విశాఖపట్నం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): బంగాళాఖాతంలో ఉన్న వాయుగుండం సోమవారం నాటికి తుఫాన్‌గా, ఆ తరువాత రెండు రోజుల్లో తీవ్ర తుఫాన్‌గా మారి కోస్తాంధ్రలో తీరం దాటనున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని, అన్ని జిల్లాల కలెక్టర్లను విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం అప్రమత్తం చేసింది. ముఖ్యంగా కోస్తాంధ్రలో విశాఖపట్నం నుంచి బాపట్ల వరకు జిల్లాలపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని తాజాగా విడుదల చేసిన బులెటిన్‌లో పేర్కొంది. దీంతో జిల్లా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా ఫిషింగ్ హార్బర్ నుంచి మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా చూడాలని మత్స్య శాఖను ఆదేశించారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న వారంతా వెంటనే వెనక్కి రావాలని హెచ్చరిక జారీచేశారు. ఆదివారం కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ ప్రధాన శాఖల అదికారులతో వెబెక్స్ నిర్వహించనున్నారు. జీవీఎంసీ, ఈపీడీసీఎల్, విద్య, రెవెన్యూ, పంచాయతీ, మత్స్య, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, సచివాలయాల విభాగం అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశాలు ఇచ్చారు. వాతావరణ శాఖ ఇప్పటికే తూర్పు నావికాదళం, కోస్టుగార్డులను అప్రమత్తం చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం శనివారం వాయుగుండంగా మారడం, సోమవారం నాటికి తుఫాన్ (అర్నాబ్)గా బలపడే అవకాశం ఉండడం, దానివల్ల 26 నుంచి 28వ తేదీ వరకు భారీవర్షాలు కురవనుండడంతో ఏపీఈపీడీసీఎల్ అప్రమత్తమైంది. సీఎండీ పృథ్వీతేజ్ శనివారం డిస్కమ్ పరిధిలోని 12 జిల్లాల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. విద్యుత్ వ్యవస్థ పరిస్థితిని ఎప్పటికిప్పుడు పరిశీలిస్తూ వెంట వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈదురుగాలులు ప్రభావం వల్ల విద్యుత్ వైర్లు తెగి పడినా, ట్రాన్స్‌ఫార్మర్లు పాడైనా తక్షణమే మరమ్మతులు చేయడానికి అవసరమైన స్తంభాలు, తదితర సరంజామా ముందుగానే సమకూర్చుకోవాలని ఆదేశించారు. విద్యుత్ వైర్లపై పడిన చెట్లకొమ్మల సమీపానికి ప్రజలు ఎవరూ వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు. వినియోగదారులు ఎటువంటి అంతరాయాలు ఉన్నా 1912 నంబర్‌కు లేదా సంబంధిత కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని కోరారు. విశాఖలో జోన్-1కు 9490610019, జోన్-2కు 9849628880, జోన్-3కు 9491030722కు కాల్ చేయాలని సూచించారు.

అధికార, విపక్షాలు పోటాపోటీగా నామినేషన్లు



పాడేరు , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): గతానికి భిన్నంగా మన్యంలోనూ స్థానిక సంస్థల ఎన్నికల వేడి రాజుకుంటున్నది. దీంతో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు కూటమి, వైసీపీ, ఇతర పార్టీలకు చెందిన నాయకులు, స్వతంత్రులు పోటాపోటీగానే నామినేషన్లను దాఖలు చేశారు. గతంలో జడ్పీటీసీ స్థానానికైనా, ఎంపీటీసీ స్థానానికైనా గరిష్ఠంగా ఐదుగురు పోటీ పడే పరిస్థితి ఉండేది కాదు. కాని ఈసారి ఎన్నికల్లో అందుకు భిన్నంగా అధిక సంఖ్యలో పోటీ పడుతున్నారు. జిల్లాలోని మొత్తం 11 జడ్పీటీసీ స్థానాలకు 144, 172 ఎంపీటీసీ స్థానాలకు 1,100 నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిని పరిశీలిస్తే.. ఒక్కో జడ్పీటీసీ స్థానానికి 13 మంది, ఎంపీటీసీ స్థానానికి ఏడుగురు చొప్పున నామినేషన్లను వేశారు. జిల్లాలోని 172 ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 1,100 నామినేషన్లు పడగా.. వాటిలో వైసీపీ నుంచి అత్యధికంగా 400 నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ నేతలు 346, స్వతంత్రులు 101, జనసేన 91, బీజేపీ 65, సీపీఎం 56, కాంగ్రెస్ 38, బీఎస్పీ 2, ఆప్ నుంచి 1 చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్లలో వైసీపీవే 400 కావడం విశేషం. అలాగే 172 జడ్పీటీసీ స్థానాలకు 144 నామినేషన్ల పడగా.. వాటిలో వైసీపీ 35, టీడీపీ 34, జనసేన 16, బీజేపీ 13, కాంగ్రెస్ 12, సీపీఎం 7, ఆప్ 4, బీఎస్పీ 1 నామినేషన్ దాఖలు చేశారు. జిల్లాలో అత్యధికంగా అరకులోయ మండలంలో 16 ఎంపీటీసీ స్థానాలకు 124 నామినేషన్లు దాఖలు కాగా అత్యల్పంగా ముంచంగిపుట్టు మండలంలో 14 స్థానాలకు 61 నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు నాయకులు దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శనివారం సజావుగా జరిగింది. జడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన నామినేషన్లను స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ టి.శ్రీపూజ బృందం పరిశీలన చేయగా, ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన నామినేషన్లను ఆయా మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు పరిశీలన చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ దాఖలు చేసిన వారి అభ్యంతరాలు, సమస్యలుంటే ఆదివారం సంబంధిత నామినేషన్ సెంటర్‌లో అప్పీల్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దీంతో ఆదివారం కూడా నామినేషన్ కేంద్రాలకు వచ్చి తమ నామినేషన్లలో నెలకొన్న సమస్యను నాయకులు పరిష్కరించుకోవచ్చు.

జిల్లాలో జరుగుతున్న నామినేషన్ల పరిశీలన ప్రక్రియను జిల్లా ఎన్నికల పరిశీలకుడు రోణంకి కూర్మనాథ్ స్వయంగా పరిశీలించారు. అందులో భాగంగా హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ, అనంతగిరిలోని నామినేషన్ కేంద్రాలను సందర్శించి, అక్కడ జరుగుతున్న నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా వాటిని పరిశీలించాలని, ఈక్రమంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని ఎన్నికల అధికారులకు పరిశీలకుడు కూర్మనాథ్ ఆదేశించారు.

'రైతు ముంగిట్లో.. ఉద్యాన శాస్త్రవేత్తలు' ప్రారంభం

గూడెంకొత్తవీధి , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త) : గిరిజన రైతుల వ్యవసాయ ప్రగతికి ఉద్యాన విశ్వవిద్యాలయం ' రైతు ముంగిట్లో.. ఉద్యాన శాస్త్రవేత్తలు' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందని చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి. రమణ అన్నారు. శనివారం మండలంలోని దుశ్చరిపాలెం గ్రామంలో శాస్త్రవేత్తలు 'రైతు ముంగిట్లో.. ఉద్యానశాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని తొలిసారిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రమణ మాట్లాడుతూ దుశ్చరపాలెం గ్రామాన్ని ఉద్యాన విశ్వవిద్యాలయం దత్తత తీసుకున్నదన్నారు. గిరిజన రైతులు సాగు చేస్తున్న అల్లం, పసుపు, మిరియాలు, కాఫీ, చిలగడ దుంప, కూరగాయల సాగును ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ వ్యవసాయంలో రాణించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. నాట్లు వేసిన నాటి నుంచి వివిధ దశల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్తలు డాక్టర్ కె.వెంకట సతీశ్, పి. రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

సమావేశంలో పాల్గొన్న ఎన్నికల పరిశీలకుడు రోణంకి గోపాలకృష్ణ, కలెక్టర్ విజయకృష్ణన్



అనకాపల్లి , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని, ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలని స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా పరిశీలకుడు రోణంకి గోపాలకృష్ణ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణ, మైక్రో అబ్జర్వర్ల విధులు, బాధ్యతలపై కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ శౌర్యమాన్ పటేల్‌తో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ రోజున ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ముందురోజు సాయంత్రమే కేంద్రానికి చేరుకొనేందుకు ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. ఎన్నికలు బ్యాలెట్ బాక్సుల ద్వారా జరుగుతాయని, నివేదికలో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత అధికారులను నేరుగా వివరణ అడిగే అవకాశం ఉందన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ ఒకే కేంద్రంలో 3 లేదా 4 పోలింగ్ స్టేషన్లు ఉన్నప్పటికీ సదరు కేంద్రమంతటికీ ఒకే మైక్రో అబ్జర్వర్ బాధ్యత వహించాలని తెలిపారు. మైక్రో అబ్జర్వర్ ప్రధాన బాధ్యత కేవలం పర్యవేక్షించడం మాత్రమేనని, పోలింగ్ ప్రక్రియలో ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోరాదన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి సూచనలు, సలహాలు ఇవ్వరాదన్నారు. ఏదైనా అక్రమాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు జరిగితే వాటిని నమోదు చేసి, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌వో సత్యనారాయణరావు, డ్వామా పీడీ నిర్మలాదేవి, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం పరిశీలన

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణ పక్కాగా ఉండాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. పట్టణంలోని గురవప్పకల్యాణ మండపంలో మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను శనివారం ఆమె పరిశీలించారు. మునిసిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ నుంచి కౌంటింగ్ వరకు ఈ కల్యాణ మండపంలో చేపడుతున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అలాగే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలుగా ఉపయోగించుకునేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇండోర్ స్టేడియాల్లో అన్ని వసతులు ఉన్నాయో?, లేదో ఆమె పరిశీలించారు. ఆమె వెంట డీఎస్పీ మోహనరావు, ఆర్డీవో కేవీ రామలక్ష్మి, తహశీల్దార్ కె.వరహాలు, కమిషనర్ ప్రసాదరాజు ఉన్నారు.

మూలపేట పోర్టులో భాగస్వామ్యం..విశాఖ పోర్టు ఆసక్తి

విశాఖపట్నం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): శ్రీకాకుళం జిల్లా మూలపేటలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న మూలపేట పోర్టులో 49 నుంచి 50 శాతం వాటా తీసుకోవడానికి విశాఖపట్నం పోర్టు ఆసక్తి చూపిస్తోంది. ఆ జిల్లాలో కొత్త పోర్టు ప్రతిపాదన వచ్చినప్పుడే సుమారు రూ.1,500 కోట్లు పెట్టుబడి పెడతామని విశాఖ పోర్టు యాజమాన్యం ప్రకటించింది. విశాఖపట్నం పోర్టులో సరుకు రవాణా పెరిగింది. భవిష్యత్తులో ఇంకా పెరగనున్నది. విస్తరణకు అవసరమైనంత భూమి లేదు. ఈ నేపథ్యంలో భీమిలి సమీపాన మూలకుద్దులో ఒక శాటిలైట్ పోర్టు నిర్మించాలనే ప్రతిపాదన చేశారు. అది కార్యరూపం దాల్చలేదు. ఇటీవల మూలపేట పోర్టు ప్రతిపాదన రాగానే అది కూడా విశాఖకు సమీపంలోనే ఉండడంతో అందులో భాగస్వామి కావడానికి ముందుకు వచ్చింది. విశాఖ పోర్టులో హ్యాండిల్ చేస్తున్న బల్క్ కార్గో బొగ్గు, ఐరన్‌ఓర్, మాంగనీస్ తదితరాలను మూలపేటకు తరలించాలనేది యాజమాన్యం ఆలోచన. దీనివల్ల విశాఖలో కొంత మేరకు కాలుష్యం తగ్గుతుందనే అభిప్రాయం ఉంది. అక్కడ మూలపేట పోర్టు జనావాసాలకు దూరంగా ఉండడం వల్ల బల్క్ కార్గో వల్ల అక్కడ ఇబ్బంది ఏమీ ఉండదు. ఈ నేపథ్యంలో ఆ పోర్టులో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపుతోంది. దీని కోసం స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ఏర్పాటుచేస్తామని పేర్కొంది. మూలపేటలో రూ.3,670 కోట్లతో పోర్టు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఏడాదికి 23.5 మిలియన్ టన్నుల సరకు రవాణా చేయాలనేది లక్ష్యం. తొలి దశలో నాలుగు బెర్తులు నిర్మించి, అందులో మూడు జనరల్ కార్గోకు, మరొకటి బొగ్గు కోసం కేటాయించనున్నారు. మూలపేటలో తొలి దశలో రెండు బెర్తులు, మలి దశలో మరో రెండు బెర్తులు తమకు కేటాయించాలని విశాఖపట్నం పోర్టు కోరుతోంది. తాము భాగస్వాములుగా ఉంటే వాణిజ్యపరంగా బాగుంటుందని, రవాణాకు తగినంత సరుకు అందుబాటులో ఉంటుందని చెబుతోంది. మూలపేట పోర్టులో ఉప్పు భూములను కేటాయించి, వాటి విలువ లెక్కిస్తే దానికి తగినట్టుగా ఆర్థిక ప్రణాళిక రూపొందిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతోంది. ఈ ప్రతిపాదనపై చర్చించాలని మంత్రుల బృందానికి ప్రభుత్వం సిఫారసు చేసింది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ దీనిపై చర్చించనున్నారు.

కృష్ణలంక పీఎస్‌లో సీబీఐ..సాయికృష్ణ కేసులో రెండో రోజు విచారణ





విజయవాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): రౌడీషీటర్ గాదె సాయికృష్ణ కస్టోడియల్ మృతి కేసులో సీబీఐ అధికారులు శనివారం కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో విచారణ కొనసాగించారు. స్టేషన్ పరిసరాలను, లాకప్‌లు, ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐల చాంబర్లు, సిబ్బంది కూర్చునే హాలు, రైటర్ క్యాబిన్‌ను వీడియో తీశారు. మంగళగిరిలోని ఫొరెన్సిక్ సైన్ ల్యాబ్ నుంచి నిపుణులను రప్పించి నమూనాలు సేకరింపజేశారు. సిట్ అధికారులు అందజేసిన ఫైళ్లను రాత్రి వరకు పరిశీలించారు. సీబీఐ హైదరాబాద్ ప్రాంతీయ స్టేషన్ అదనపు ఎస్పీ సీహెచ్‌వీ నరేంద్రదేవ్‌తో పాటు డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు మొత్తం పది మందికి పైగా దర్యాప్తులో ఉన్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న గులివిందల సురేష్‌కుమార్(ఏ4), కోనేటి వెంకటరాజు (ఏ7) ఇళ్లలో ఆదివారం సోదాలు చేయడానికి సీబీఐ అధికారులు సిద్ధమయ్యారని తెలిసింది. వారిలో సురేష్‌కుమార్ నాటి ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు అత్యంత సన్నిహితుడు కాగా వెంకటరాజు పోలీసు స్టేషన్‌లో సీసీ కెమెరాల వ్యవహారాలను పర్యవేక్షించడానికి హోంగార్డుగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన బెయిల్‌పై బయట ఉన్నారు. ఈ కేసులో రెండో నిందితుడిగా ఉన్న మాజీ హెడ్‌కానిస్టేబుల్ పోతర్లంక అశోక్‌కుమార్ ఆదేశాలతో స్టేషన్‌లో డీవీఆర్‌లు, హార్డ్‌డిస్కును వెంకటరాజు మాయం చేసినట్టు సిట్ అధికారులు నిర్ధారించారు. సాయికృష్ణను మార్కాపురం నుంచి కృష్ణలంక పోలీసు స్టేషన్‌కు తీసుకురావడం, తర్వాత బయటకు తీసుకెళ్లడం వంటి దృశ్యాలను చిత్రీకరించిన ప్రధాన ద్వారం వద్ద ఉన్న సీసీ కెమెరాను తొలగించినట్లు గుర్తించారు.

ఆ హార్డ్‌డిస్కులు, డీవీఆర్ ఆచూకీని కనిపెట్టే పనిలో సీబీఐ ఉన్నట్టు తెలుస్తోంది. సాయికృష్ణ కస్టోడియల్ డెత్ అనంతరం అతని కుటుంబ సభ్యులతో సురేష్‌కుమార్ రాయబేరాలు నడిపారు. ఈ ఇద్దరి ఇళ్లలో సోదాలు చేయడానికి సంబంధించి కోర్టు ఇవ్వాటికే అనుమతి మంజూరు చేసింది.

దేవాదాయ శాఖలో సూపరింటెండెంట్ పోస్టులు మాయం

డీఈఓలుగా పదోన్నతి..కొత్త జిల్లాలకు సర్దుబాటు

విశాఖపట్నం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త) : దేవదాయ శాఖలో సూపరింటెండెంట్ పోస్టులు ఎత్తేశారు. ప్రతి జిల్లా కార్యాలయంలో అవసరాన్ని బట్టి ఒకరు, విశాఖ వంటి జిల్లాలో ఇద్దరు చొప్పున సూపరింటెండెంట్లు ఉండేవారు. కొత్త జిల్లాలు ఏర్పాటుచేసిన తరువాత కొత్త పోస్టులు ఇవ్వలేదు. దాంతో ఉన్నవారినే కమిషనరేట్ కార్యాలయం సర్దుబాటు చేసింది. జిల్లా దేవదాయ శాఖాధికారి కార్యాలయంలో ఉండే సూపరింటెండెంట్లకు జిల్లా దేవదాయ శాఖాధికారి (డీఈఓ)గా పదోన్నతి కల్పించి కొత్త జిల్లాలకు పంపించారు. ఆ విధంగా విశాఖ జిల్లా కార్యాలయంలో ఇద్దరు ఉండగా ఒకరిని అనకాపల్లి డీఈఓగా పంపించారు. విజయనగరంలో సూపరింటెండెంట్‌ను పార్వతీపురం మన్యం డీఈఓగా వేశారు. తాజాగా జోన్ల విభజన కూడా చేశాక విశాఖ జిల్లాలో మిగిలిన సూపరింటెండెంట్ పోస్టును కాకినాడ జోనల్ కార్యాలయానికి కేటాయించేశారు. దాంతో ఇక్కడ పనిచేస్తున్న సూపరింటెండెంట్ ప్రసాద్ అక్కడకు వెళ్లిపోయారు. అనకాపల్లి డీఈఓగా వెళ్లిన సుధారాణి కాకినాడ ఆప్షన్ తీసుకోవడంతో ఆమెను ఆ జోన్‌కు బదిలీ చేశారు. దాంతో అనకాపల్లిలో ఖాళీ అయిన డీఈఓ పోస్టులో శ్రీకాకుళంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రమణిని నియమించారు. ఈ సర్దుబాట్లలో మొత్తం ఉత్తరాంధ్ర జిల్లాల్లోని డీఈఓ కార్యాలయాల్లో సూపరింటెండెంట్ పోస్టులు మొత్తం మాయమైపోయాయి. కొత్త పోస్టులు మంజూరుకాకపోవడం వల్ల ఇప్పుడు సూపరింటెండెంట్లు చేస్తున్న పనులన్నీ డీఈఓలే చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

అగ్రి గోల్డ్ బాధితులు ఈ తేదీల్లో రావాలి

సంబంధిత పత్రాలు ఉండాలంటూ అధికారుల సూచన

ఏలూరు , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): అగ్రిగోల్డ్ బాధితులు డిపాజిట్ బాండ్ల కలర్ జిరాక్స్‌లు, ఇతర ధ్రువపత్రాలను సీఐడీ అధికారులకు అందజేసే కార్యక్ర మం కొద్ది రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. ఈనెల 26, 27 తేదీల్లో పెదపాడు మండలంలోని అగ్రిగోల్డ్ బాధితులు ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయ సమీ పంలో ఉన్న పెరేడ్ గ్రౌండ్‌కు హాజరై అక్కడ ఉన్న సీఐడీ అధికారులకు తమ వద్ద ధ్రువపత్రాలు అందజేయాలని అధికారులు తెలిపారు. 28, 29 తేదీల్లో కొయ్యలగూడెం మండలం, 30, 31 తేదీల్లో లింగపాలెం మండలాల అగ్రిగోల్డ్ బాధితులు హాజరవ్వాలని సీఐడీ అధికారులు సూచించారు. అగ్రిగోల్డ్ బాధితులు వచ్చేటప్పుడు ఒరిజినల్ అగ్రిగోల్డ్ బాండ్, కలర్ జిరాక్స్, బ్యాంక్ పాస్ బుక్క్ మొదటి పేజీ జిరాక్స్, ఆధార్‌కాని, ఓటరు గుర్తింపు కాని, రేషన్‌కార్డు జిరాక్స్, పాన్‌కార్డు జిరాక్స్, డిపాజిట్ దారులు మరణిస్తే వారి నామినీ ఐడీ ప్రూఫ్, డిపా జిట్‌దారుని మరణ ధృవపత్రం, బంధువులు అయితే ఫ్యామిలీ సర్టిఫికెట్, డిపా జిట్ దారుడు లేవలేని స్థితిలో ఆధరైజేషన్ ధృవపత్రం, పాస్‌పోర్టు సైజు ఫోటో ఒకటి తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సీఐడీ అధికారి సెల్ నెంబర్ 92475 97968ను సంప్రదించాలని సూచించారు.

మారుమూల పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా

పోలీస్ చెక్‌పోస్టు వద్ద రాత్రి సమయంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ నాని



ముంచంగిపుట్టు , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలంలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మారుమూల ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి భద్రతను కట్టుదిట్టంగా చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. మండలంలో 23 పంచాయతీల పరిధిలో 14 ఎంపీటీసీ సెగ్మెంట్లకు 45 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటిలో గత ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలు, పోలింగ్ కేంద్రాలకు చేరకోవడంలో ఎదరవుతున్న ఇబ్బందులు, సుదూర ప్రయాణాలు, పరిమిత రవాణా సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, ఇతర అంశాల ఆధారంగా జిల్లా ఎన్నికల అధికారి చేసిన అభ్యర్థన మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం బూసిపుట్టు, బుంగాపుట్టు, రంగబయలు, కుమడ, వనుగుమ్మ, బాబుసాలలో గల ఏడు పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ సమయాన్ని కుదించింది. ఆయా కేంద్రాల వద్ద ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగాల్సిన పోలింగ్‌ను మధ్యాహ్నం 3 గంటలు వరకు మాత్రమే నిర్వహించడం జరుగుతుందని అధికారులు ప్రకటించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఎస్పీ అమిత్ బర్దార్‌తోపాటు పోలీసు ఉన్నతాధికారులు భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో పోలీసు బలగాలను మోహరించడంతోపాటు అనుమానాస్పద కదలికలపై నిఘా పెడుతున్నారు. ప్రధాన రహదారులు, మారుమూల ప్రాంతాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తూ.. అవసరమైన చోట్ల గాలింపు చర్యలు చేపడుతున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న బ్యాలెట్ బాక్స్‌ల వద్ద పోలీస్ భద్రతను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటుచేశారు. ఇక్కడ 24 గంటలూ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా నగదు, మద్యం, ఇతర ప్రలోభపరిచే వస్తువుల తరలింపు జరగకుండా తనిఖీలు చేపడుతున్నారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలగకుండా ఉండేందుకు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే సుమారు 300 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. గిరిజన ప్రాంతాలు, దూరప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది సకాలంలో చేరుకోవడం, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడడం కూడా కీలకంగా మారింది. పోలింగ్ సామగ్రి తరలింపు, సిబ్బంది భద్రత, ఓటర్ల రాకపోకలు వంటి అంశాలపై అధికారులు సమన్వయంతో వ్యవహరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అత్యంత సమస్యాత్మక కేంద్రాల వద్ద పరిస్థితులకు అనుగుణంగా భద్రత చర్యలు చేపట్టేందుకు పోలీసు యంత్రాంగం సిద్ధమవుతోంది. ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచిస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

400 కి.మీ. ఓటు ప్రయాణం..పోలవరం నిర్వాసిత గిరిజనుల అవస్థలు



బుట్టాయగూడెం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): పోలవరం ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేసిన గిరిజనులు.. ఇప్పుడు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఓటు వేసేందుకు రానుపోను సుమారు 400 కిలోమీటర్లు ప్రయాణించాల్సిన దయనీయ పరిస్థితిలో ఉన్నారు. పోలవరం జిల్లా రంపచోడవరం డివిజన్ చింతూరు ఐటీడీఏ పరిధిలోని వీఆర్‌పురం మండలానికి చెందిన కొండరెడ్డి గిరిజన గ్రామాలైన కొల్లూరు, కొండేపూడి, తుమ్ములేరు, పోచవరం, చొక్కనపల్లి వాసులను ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం రామన్న గూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి కొన్నేళ్ల క్రితం తరలించారు. ఐదు గ్రామాలకు చెందిన 350 మంది వరకు ఓటర్లు ఇక్కడ నివసిస్తున్నారు. నిర్వాసితులకు పునరా వాసం కల్పించిన ప్రభుత్వం, అధికారు లు.. వారి ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డుల్లో స్థానికతను మార్చలేదు. దీంతో వారు ప్రతి చిన్న పనికీ వందలాది కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో వారు ఓటు వేసేందుకు గతంలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సి ఉంది. మొదట రామన్నగూడెం నుంచి వేలేరుపాడు మండలం కొయిదా వరకు రోడ్డు ప్రయాణం చేయాలి. అక్కడ బోటు ఎక్కి గోదావరిలో 2కిలోమీటర్లు ప్రయాణించాక మరో 2కిలోమీటర్లు కాలినడకన పోచవరంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలి. ఒక్కో వ్యక్తికి రూ.1,000 వరకు ఖర్చవుతుంది. రామన్నగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీని ప్రత్యేక పంచాయతీగా గుర్తించి రేషన్, ఆధార్ కార్డులు, ఓటర్ ఐడీలను మార్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నేత్రపర్వం..శ్రీవారికి ఎదుర్కోలు ఉత్సవం



ద్వారకాతిరుమల , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): బ్రహ్మాండనాయకుడైన ద్వారకాతిరుమల వాసుని ఆశ్వయుజ మాన దివ్యబ్రహ్మోత్సవాలు శ్రీవారి క్షేత్రంలో వైభవంగా జరుగుతున్నాయి. ఈనెల 21న ప్రారంభమైన ఈ ఉత్సవాలు 28 వరకు జరుగనున్నాయి. దీనిలో భాగంగా నాలుగో రోజు శనివారం రాత్రి జరిగిన ఎదుర్కోలు మహోత్సవాన్ని స్వామివారి నిత్యకల్యాణమండ పంలో అర్చకులు, పండితులు, అధికారులు, భక్తులతో వేడుకగా నిర్వహించారు. శనివారం భక్తులతో శ్రీవారి ఆలయం కిటకిటలాడింది. దాదాపు పదిహేనువేల మంది పైబడి భక్తులు సందర్శించినట్టు అధికారులు తెలిపారు. భక్తులు స్వామివారి దర్శన అనంతరం శ్రీవకుళమాత అన్నప్రసాద భవనానికి వెళ్లి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. స్వామివారి కల్యాణానికి ముందురోజున ఈ ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయం. ఈ వేడుకకు బ్రహ్మోత్సవాల్లో అధిక ప్రాధాన్యత ఉంది, శ్రీవారి ఆలయ ఆవరణలో వెండి శేషవాహనంపై ఉభయదేవేరులతో స్వామిని ఉంచి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం అట్టహాసంగా నిత్యకల్యాణ వేదిక వద్దకు తెచ్చారు. అనం తరం హారతులిచ్చి అర్చకులు ఎదుర్కోలు ఉత్సవాన్ని ప్రారంభించారు. మండప ఆవరణలో అర్చకులు, అధికారులు, పండితులు, భక్తులు రెండు జట్లుగా విడిపోయి ఒక జట్టు స్వామివారి గుణగణాలను, ఆయన విశిష్టతను కొనియాడారు. రెండో జట్టు అమ్మవార్ల గుణగణాలను, వారి కీర్తిని తెలిపారు. వివాహం జరిగే ముందు రోజు వధూవరుల తరపు బంధువులు శుభలేఖను పంచేందుకు జరిపే కార్యక్రమమే ఎదుర్కోలుగా పండితులు చెబుతున్నారు. భక్తవరదుడైన శ్రీవారు సువర్ణ హనుమద్వాహనాన్ని అధిష్టించి శనివారం ఉదయం తిరువీధుల్లో ఊరేగారు. ధనుర్బాణాలను ధరించి రామావతారంలో కొలువుతీరిన శ్రీవారు బంగారు హనుమంత వాహనంపై భక్తజనరంజకంగా తిరువీధుల్లో ఊరేగారు. శ్రీవారి దివ్య బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు అలంకరణల్లో భాగంగా శనివారం శ్రీరామ పాదుకా సమేత భరతుని అలంకారం భక్తులను ఆకట్టుకుంది. నిరుపమానమైన సోదరప్రేమకు, ధర్మ నిరతికి, త్యాగానికి సమున్నత చిహ్నం భరతుడు. శ్రీరాముడు అరణ్యవాసంలో ఉన్నప్పుడు భరతుడు వచ్చి అయోధ్యకు రమ్మని పట్టాభిషిక్తుడు కమ్మని కోరతాడు. దీనిని శ్రీరాముడు తిరస్కరిం చడంతో ఆయన ప్రతినిధిగా రాజ్యాన్ని పాలించేందుకు పాదుకలు ఇమ్మని ప్రార్థిస్తాడు. ఈమేరకు శ్రీరాముడు పాదుకలను అనుగ్రహించడంతో వాటిని ఎంతో భక్తిశ్రద్ధలతో తన శిరస్సుపై ఉంచుకుని అయోధ్యకు తీసుకొచ్చే ఘట్టం ఇక్కడ ఆవిష్కృతమైంది. ద్వారకా తిరుమలేశుని దివ్య కల్యాణమహోత్సవానికి దేవస్థానం సర్వం సిద్ధం చేసింది. చినవెంకన్న కల్యాణాన్ని ఆదివారం రాత్రి అం గరంగ వైభవంగా జరిపేందుకు కళావైభవాలతో అనివేటి మం డపంలో ఏర్పాటుచేసిన కల్యాణ మండపాన్ని ముస్తాబు చేస్తు న్నారు. ఆదివారం రాత్రి 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ కల్యాణ వేడుకలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొనే అవకాశం ఉందని ఈవో త్రినాథరావు తెలిపారు. గుర్వార్లుగూడెం మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం పంచామృత అభిషేకం నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో ఉదయం 8 గంటలకు ఆలయ అర్చ కులు, వేద పండితుల ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. పలు సేవల రూపంలో రూ.2,56,653 ఆదాయం సమకూరినట్లు, ఆలయాన్ని సందర్శించిన సుమారు 3253 మంది భక్తులకు స్వామివారి నిత్యాన్నదాన సత్రంలో అన్నదానం నిర్వహించినట్లు ఈవో చందన తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకే ప్రజలు పట్టం : వంగవీటి రాధ

విజయవాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త) : స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకే ప్రజలు పట్టం కట్టడం ఖాయమని విజయవాడ నగర మేయర్ పదవికి కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన వంగవీటి రాధాకృష్ణ విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో ప్రజా స్పందన, ఆశీర్వాదమే తనకు, తమ 86 మంది కూటమి అభ్యర్థుల విజయాన్ని తెలియచేస్తుందని అన్నారు. ఆదివారం తూర్పు నియోజకవర్గం పరిధిలోని మాచవరం, మొగల్రాజపురం, క్రీస్తు రాజపురం, గుణదల తదితర ప్రాంతాల్లో కూటమి నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావుతో కలిసి వంగవీటి రాధాకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారికి మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వంగవీటి రాధ మాట్లాడుతూ.. ఓ పక్కన అభివృద్ధి మరో పక్కన సంక్షేమంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఓ పక్కన పార్లమెంట్ సభ్యులు.. కేంద్రం నుంచి నిధులు తెప్పిస్తున్నారని చెప్పారు. స్థానిక శాసనసభ్యుడు గద్దె రామ్మోహన్‌తోపాటు బీజేపీ నేతలతో కలిసి ఐక్యంగా వెళ్తున్నామని పేర్కొన్నారు. మూడు పార్టీల తరఫున రిప్రజెంటేషన్ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యకర్తలను, నాయకులను అంతా సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తామన్నారు. ఎన్నికల ప్రచారంలో తాము ఎక్కడికి వెళ్లినా ప్రజలు తమకు నీరాజనాలు పలుకుతున్నారని చెప్పారు.



సాధిస్తాం : ఎంపీ చిన్ని

కార్పొరేషన్ ఎన్నికల్లో 100 శాతం స్ట్రేక్ రేట్

ఈ రెండేళ్ల కూటమి పాలనలో విజయవాడ నగరంలో ఎంతో అభివృద్ధి జరిగిందని స్థానిక ఎంపీ, టీడీపీ నేత కేశినేని చిన్ని తెలిపారు. వరదల సమయంలో సీఎం చంద్రబాబు చేపట్టిన చర్యల వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగలేదని గుర్తు చేశారు. ఈ కొండ ప్రాంతంలో ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరించామని తెలిపారు. గత 50 ఏళ్ల సమస్యను నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే శాశ్వత పరిష్కారం చూపిందని పేర్కొన్నారు. సుమారు 26,500 కుటుంబాలకి ఈ కొండ ప్రాంతం చుట్టుపక్కల ఇళ్ల స్థలాలు ఇచ్చామని చెప్పారు. సీఎం చంద్రబాబు కారణంగా నేడు అందరూ లక్షాధికారులుగా కనబడుతున్నా రని అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థి వంగవీటి రాధతోపాటు తమ కూటమిలో 86 మంది అభ్యర్థులు గెలిచి వంద శాతం స్ట్రైక్ రేట్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అందరం సమన్వయంతో పని చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరిపాలనను ప్రజలంతా మెచ్చుకుంటున్నారని అన్నారు. ఈ కూటమి ప్రభుత్వం మరో 30 సంవత్సరాలు ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఇప్పుడు దాకా డబుల్ ఇంజన్ సర్కార్ ఉందని.. ఇక స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి త్రిబుల్ ఇంజన్ సర్కార్ రాబోతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. లోకల్ బాడీలో కూడా కూటమి అధికారంలోకి వచ్చి ట్రిబుల్ ఇంజన్ సర్కార్లతో పని చేస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లల్లో వెళ్లే విధంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

ఓటు వేస్ట్ చేయొద్దు: ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

విజయవాడ అభివృద్ధి మరింత స్పీడ్‌గా జరగడానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థులను గెలిపించాలని నగర ప్రజలకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాభివృద్ధి తిరోగమనంలో సాగిందని.. దీనిని ఈ కూటమి ప్రభుత్వం సరి చేసిందని అన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం నాయకత్వంలో ప్రభుత్వం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోం దని తెలిపారు. ఈ ఎన్నికల్లో కూటమి గెలిస్తే.. మూడు ఇంజిన్లతో శరవేగంగా అభివృద్ధి కార్యక్ర మాలు జరుగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఏ ఓటు కూడా వేస్ట్ చేయొద్దని ప్రజలకు టీడీపీ ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని మోదీ సహకారంతో భారీగా నిధులు తెచ్చి అభివృద్ధఇ కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు. ఈ ప్రభుత్వానికి మరింత చేయూతను ఇవ్వల్సిందిగా ప్రజలని ఆయన కోరారు. ఎక్కడ సైకిల్, గ్లాసు, కమలం గుర్తు కనపడినా.. వాటికి మాత్రమే ఓటు వేయ్యాలని ప్రజలకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు.

టెకిన్ సంస్థతో పి.బి. సిద్ధార్థ ఒప్పందం



విజయవాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, టెక్ ఇన్ ప్రాసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ఎంబీఏ విభాగం సహకారంతో పరస్పర అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేశ్ తెలిపారు. టెక్ ఇన్ మేనేజింగ్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, కళాశాల సమన్వయకర్తగా మేకా రమేశ్ మూడేళ్ల కాలపరిమితితో కూడిన ఎం.ఓ.యూ. పై శనివారం సంతకాలు చేశారు. యూజీ, పీజీ విద్యార్థుల ఉపాధి శిక్షణ, నైపుణ్యాల అభివృద్ధి, రెజ్యూమే రూపకల్పన, సదస్సులు, సమావేశాలు, అధ్యాపన అభివృద్ధి కార్యక్రమం, వర్క్ షాపులు, ఇంటర్న్ షిప్, పరిశ్రమల అవసరాల మేరకు ప్రత్యక్ష కృత్యాలు మొదలైన అంశాల్లో టెకిన్ సంస్థ సాంకేతిక సహకారం అందిస్తుందని, మార్గనిర్దేశకత్వం చేస్తుందని డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ఆచార్య రాజేష్ రాజేశ్ సి.జంపాల తెలిపారు. కార్యక్రమంలో ఎం.బి.ఎ. అధ్యాపకులు డాక్టర్ ఎండీఎస్ రహమాన్, ఉపాధి కల్పన విభాగం అధికారి కావూరు శ్రీధర్ పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను

విజయవాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త) : కూటమి పొత్తు లో భాగంగా కొన్ని సీట్లు జనసేన కార్యకర్తలు త్యాగం చేయవలసి వచ్చినది.పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుంది.కూటమి పొత్తు ధర్మానికి అందరూ కట్టుబడి పని చేయాలి. జన సైనికులు అధైర్య పడవలసిన పనిలేదు.భారీ మెజార్టీతో విజయవాడ మేయర్ స్థానాన్ని జనసేన కైవసం చేసుకోబోతు న్నందుకు సంతోషంగా ఉన్నది అని ఆయన అన్నారు. జనసేన రాష్ట్ర పార్టీ నాయకులు కోశాధికారి రత్నం, అరవ రామకృష్ణ తదితరులు పాల్గొనడం జరిగింది. రాష్ట్ర ఆడిటర్ రత్నం మరియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను కలసి జనసైనికులకు దిశా



నిర్దేశించడం సంతోషంగా ఉన్నదని.విజయవాడ మొత్తం మీద జనసేనకులందరూ కలిసికట్టుగా పని చేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని.సీటు దక్కని వారు అధైర్యం పడవలసిన పనిలేదని ప్రతి ఒక్కరికి తగిన సమయంలో న్యాయం చేస్తానని.మన అధినాయకుడు పవన్ కళ్యాణ్ తెలియజేయడం జరిగిందని. ఆడిటర్ రత్నం తెలియజేశారు అన్నారు.

సీఎస్ఐ చర్చి వించిపేట కార్యలయం లో మీడియా సమావేశం



విజయవాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త) : మైనారిటీల ద్రోహులు కూటమి ప్రభుత్వం ఎంసిపీఐ (యు)పార్టీ రాష్ట్ర సహాయ కార్య దర్శి ఎస్ కె ఖాదర్ బాషా,ఎంసీపీఐ (యు)పార్టీ విజయవాడ నగర కార్య లయం సీ ఎస్ ఐ చర్చి వించిపేట కార్య లయం లో మీడియా సమావేశం జరిగింది ఈ సమావేశం లో పార్టీ రాష్ట్ర సహాయ కార్య దర్శి ఎస్ కె ఖాదర్ బాషా మాట్లాడు తు కూటమి ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్ పేరుతో భూములను లాక్కొవాటానికి ముస్లిం సమాజం పెద్ద ఎత్తున్న ఉద్యమం చేస్తే కూటమి లో ఉన్న ముస్లిం లు పాల్గొనలేదు అని అలాగే జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ముస్లిం లు ఉగ్రవాదులు అని అన్నా రు అప్పుడు కూడా కూటమి లో ఉన్న ముస్లిం లు నోరులు పడి పోయాయి అని కూటమి విజయవాడ పశ్చిమ అభ్యర్థులు డివిజన్ లో ఓట్ల ప్రచారం లో ఒటర్ లను మాకు ఓట్లు వేయ కపోతే మీకు సంక్షేమ పథకా లు రావు అని భయ బ్రాం తుల కు గురి చేస్తున్నారు అని కొన్ని డివిజన్ లో పక్క నియోజకవర్గం లో నుండి అభ్యర్థులను నిల బెట్టారు అని అన్నా రు పార్టీ రాష్ట్ర కార్య దర్శి వర్గ సభ్యులు ఎస్ డి సలీం మాట్లాడు తు సర్ పేరుతో ఓట్ హక్కు పై దాడి చేస్తుంటే దానికి వ్యతిరేకం గా ఉద్యమాలు చేస్తుంటే ముఖ్యం గా మైనారిటీ ల ఓట్లు తీస్తుంటే కనీసం కూటమి లో ఉన్న ముస్లిం సమాజం నోర్లు పడిపో యాయి అని ఈ రోజు ఏ మొఖాలు పెట్టు కొని ఓట్లు అడుగుతున్నా రు అన్నా రు ఈ సమావేశం లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ కె అజా జ్ పాల్గొన్నారు

కృష్ణాజిల్లాలో రోడ్డు ప్రమాదం

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు, మహిళ మృతి

మచిలీపట్నం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): జిల్లాలోని విజయవాడ-మచిలీపట్నం హైవేపై ఈ రోజు(ఆదివారం) తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. పలువురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణాజిల్లాలో జగ్గయ్యపేటకు చెందిన ఓ కుటుంబం.. ఈ రోజు తెల్లవారుజామున స్వగ్రామం నుంచి మోపిదేవికి కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో కారు విజయవాడ-మచిలీపట్నం హైవేపై వెళ్తుండగా.. గుడివాడ ఫ్లైఓవర్ సమీపాన గల పామర్రుకు చేరుకోగానే.. హైవేపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒరుసు చిన్న తిరుపతమ్మ(60) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందగా.. మిగిలిన కుటుంబసభ్యులకు స్వల్పగాయా లయ్యాయి. గమనించిన వాహనదారులు హుటాహుటినా క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తుచేపట్టారు.

ఢిల్లీకి "సర్" ఏఐసీసీ అబ్జర్వర్లుగా ఎన్.రఘువీరా రెడ్డి, గిడుగు రుద్రరాజు



విజయవాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): ఓటర్ల జాబితాకు సంబంధించి భారత ఎన్నికల సంఘం చేపట్టే ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ (సర్) ఏఐసీసీ అబ్జర్వర్లుగా ఢిల్లీకి మాజీ పీసీసీ అధ్యక్షులు ఎన్.రఘువీరా రెడ్డి, గిడుగు రుద్రరాజును అధిష్టానం నియమించింది. ఈ మేరకు నవంబరు 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరిగే "ఓట్ బచావ్.. దేశ్ బచావ్" భారీ బహిరంగ సభకు జనసమీకరణ, ఇతర ఏర్పాట్లపై ఇందిరా భవన్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కెసి వేణు గోపాల్ అధ్యక్షతన ఢిల్లీ పీసీసీ అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్, ఏఐసీసీ ట్రెజరర్ అజయ్ మాకెన్, ఢిల్లీ వ్యవహారాల ఇంచార్జ్ ఖాజీ నిజాముద్దీన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పీసీసీ మాజీ అధక్షులు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, వివిధ విభాగాల అధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి మాజీ పీసీసీ అధ్యక్షులు ఎన్. రఘువీరా రెడ్డి, గిడుగు రుద్రరాజు హాజరయ్యారు.

ఎన్టీఆర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల వ్యయ పరిశీలకులుగా విజయకుమార్ నియామకం



విజయవాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): ఎన్టీఆర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల వ్యయ పరిశీలకులుగా రాజమహేంద్రవరం ఎ.పి రాష్ట్ర అటవీ అకాడమీ ప్రధాన అటవీ సంరక్షణాధికారి & సంచాలకులు బి.విజయకుమార్ (ఐ.ఎఫ్.ఎస్)ని నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశను విజయవాడ కలెక్టరేట్ ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో విజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలుసుకొని స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చించారు. జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు విజయకుమార్ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు తమ రోజువారీ ఖర్చులు, బ్యాంకు ఖాతా లావాదేవీలకు సంబంధించి నిర్వహించే ఎన్నికల వ్యయ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేసి పర్యవేక్షించడం, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, వ్యయ పరిమితులను ఏ అభ్యర్థి కూడా ఉల్లంఘించకుండా క్షేత్రస్థాయిలో కట్టుదిట్టమైన నిఘా ఉంచడం, జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, ప్రచార వాహనాలు, ప్రచార సామగ్రి (ఫ్లెక్సీలు, పోస్టర్లు తదితర) ఖర్చులను గుర్తించి, అధికారికంగా నమర్పించే లెక్కలతో సరిపోల్చడం జరుగుతుంది. అలాగే ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు వ్యయ పరిశీలన పురోగతి, అభ్యర్థుల ఖర్చుల వివరాలపై ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం నిర్దేశించిన అధికారిక ఇమెయిల్ observers .apsec @gmail.com ద్వారా రాష్ట్ర ఎన్నికల సంఘానికి నేరుగా నివేదికలను సమర్పించనున్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు జరిగే నగదు, బహుమతులు, మద్యం వంపిణీలను అడ్డుకునేందుకు జిల్లా స్థాయి ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు, వీడియో సర్వైలెన్స్ టీమ్‌లు, అకౌంటింగ్ బృందాలతో సమన్వయం చేసుకోవడం జరుగుతుంది. ఎన్నికలకు సంబంధించి ఏదైనా సమాచారాన్ని 62810 72815కు అందజేయాలని విజయ కుమార్ కోరారు.

స్థానిక ఎన్నికల్లో వైసీపీ అరాచకాలపై ఎస్ఈసీకి కూటమి నేతల ఫిర్యాదు

విజయవాడ , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ సృష్టించిన అరాచకాలపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) కూటమి నేతలు వర్ల రామయ్య, చిల్లపల్లి శ్రీనివాస్, పాతూరి నాగభూషణం ఫిర్యాదు చేశారు. ప్రజలు అంగీకరించకపోవడంతో, స్థానిక సంస్థల ఎన్నికలను ఎలాగైనా ఆపేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. నామినేషన్ పత్రాలను వారే చించుకుని, బారికేడ్లు పడేసి, పోలీసులపై దాడులు చేస్తూ వైసీపీ నేతలు దొంగ నాటకాలు ఆడుతున్నారని కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ గ్యాంగ్ వ్యవహారశైలి స్టూవర్టుపురం, కంజరభట్ ముఠాల తరహాలో తయారైందని విమర్శించారు. మున్సిపాలిటీల్లో 8,128, జెడ్పీటీసీల్లో 1,815, ఎంపీటీసీల్లో 20,556 స్థానాల్లో వైసీపీ నామినేషన్లు వేసిందని.. మరి వాళ్లను ఎక్కడ అడ్డుకున్నట్లు అని కూటమి నేతలు ప్రశ్నించారు. ఐదున్నరేళ్లుగా జగన్ మోహన్ రెడ్డి ఒక్కసారి కూడా ప్రెస్‌మీట్ ఎందుకు పెట్టలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ ఆరాచకాలకు సంబంధించిన ఆధారాలను పెన్ డ్రైవ్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఇచ్చామని.. సిట్ వేసి విచారించాలని కోరామని చెప్పారు. ఎన్నికలు ఆగిపోతే పంచాయతీలు, స్థానిక సంస్థలకు ఏటా వచ్చే రూ.15 వేల కోట్ల నిధులు ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఎన్నికలు జరిగితే కూటమి గెలుస్తుందనే భయంతోనే, రాయలసీమ, ప్రకాశం జిల్లాలో వైసీపీ కావాలనే గొడవలు సృష్టిస్తోందని కూటమి నేతలు ఆరోపించారు.

నామినేషన్ల పరిశీలన కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ



మచిలీపట్నం , అక్టోబర్ 25 (గ్లోబల్ వార్త): జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు లు గన్నవరం, ఉంగుటూరులలోని నామినేషన్ల పరిశీలనా కేంద్రాలను సందర్శించి అక్కడ చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల పరిశీలన ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా, కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేస్తూ, అభ్యర్థులు, వారి ప్రతినిధులు, ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.

తరుముకొస్తున్న తుఫాన్

ఒకటి తరువాయి

భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయి. ఈ నెల 28న విశాఖపట్నం-మచిలీపట్నం మధ్య (కాకినాడకు దక్షిణాన యానాం వద్ద) తీరం దాటనుందని పలు వాతావరణ మోడళ్లు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కోస్తాంధ్రలోని అన్ని జిల్లాలకు వాతావరణ శాఖ ఆరంజ్ అలర్ట్ జారీచేసింది. సోమవారం నుంచి పలు జిల్లాల తీరంలో గంటకు 80-140 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు కూడా వీయనున్నాయి. తుఫాన్ తీరం దాటే సమయంలో వీటి తీవ్రత మరింత ఎక్కువగా ఉండనుంది. బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం నేపథ్యంలో మత్స్యకారులకు అధికారులు హెచ్చరికలు జారీచేశారు. ఈ నెల 29 వరకు సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలలు ఎగసిపడతాయని, అందువల్ల చేపల వేటకు వెళ్లవద్దని, లోపల ఉండే వారంతా వెంటనే తీరానికి రావాలని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం సూచించింది. కోస్తాంధ్రలోని అన్ని ఓడరేవుల్లో ఒకటో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు.

తీర ప్రాంతాల్లో పెనుగాలులు

తూర్పు మధ్య, ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం నైరుతి దిశగా పయనించి ఆదివారం ఉదయానికి బలపడి తీవ్ర వాయుగుండంగా మారింది. మధ్యాహ్నానికి తూర్పు ఆగ్నేయంగా విశాఖకు 820 కిలోమీటర్లు, కాకినాడకు 910 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 1,010 కిలోమీటర్ల దూరంలో ఉంది. సోమవారం ఉదయం వరకు నైరుతి దిశలో పయనించే క్రమంలో తుఫాన్‌గా మారనుంది. ఆ తర్వాత ఇది పశ్చిమ వాయవ్యంగా దిశ మార్చుకుని ఈ నెల 27 ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ప్రవేశించే సమయానికి తీవ్ర తుఫాన్‌గా, సాయంత్రానికి అతి తీవ్ర తుఫాన్‌గా బలపడనుంది. ఆ తర్వాత వాయవ్యంగా దిశ మార్చుకుని 28 ఉదయానికి కోస్తాంధ్ర తీరం దిశగా రానుంది. ఈ క్రమంలో విశాఖపట్నం-మచిలీపట్నం మధ్య తీరం దాటనుందని వాతావరణ శాఖ తెలిపింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కోస్తాంధ్రలో పలు జిల్లాల తీరంలో గంటకు 80-100 కిలోమీటర్లు, రాత్రి నుంచి 115 కి.మీ.ల వరకూ వేగంతో గాలులు వీస్తాయి. ఈ నెల 27న తీవ్ర తుఫాన్‌గా మారే క్రమంలో గాలుల వేగం 140 కి.మీ.లకు పెరగనుంది. అతి తీవ్ర తుపాన్ తీరం దాటే సమయంలో ఇదే తీవ్రత కొనసాగుతుంది. 28న తుఫాన్ తీరం దాటే సమయంలో అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పలు ప్రాంతాలు, యానాంలో సముద్రం అలలు ఒక మీటరు నుంచి ఒకటిన్నర మీటర్ల ఎత్తు వరకు ఎగసిపడతాయని వాతావరణ శాఖ పేర్కొంది. తుఫాన్ తీరం దాటే సమయంలో అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయగోదావరి జిల్లాలపై ఎక్కువ ప్రభావం చూపుతుందని వాతావరణ నిపుణులు హెచ్చరించారు.

కోస్తాంధ్రలో భారీ వర్షాలు

సోమవారం కోస్తాంధ్రలో పలుచోట్ల వర్షాలు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 27న కోస్తాంధ్రలో అనేక ప్రాంతాల్లో వర్షాలు, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో కుంభవృష్టి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అతి భారీగా, కోస్తాంధ్రలో మిగిలిన జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. 28న విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలు, యానాంలో కుంభవృష్టి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, బాపట్ల జిల్లాల్లో అతి భారీ, కోస్తాంధ్రలోని మిగిలిన జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

ప్రజలకు ఇబ్బందులు రాకూడదు! : సీఎం

ఒకటి తరువాయి

సహాయ, పునరావాస కేంద్రాలు సిద్ధం చేయాలి. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. పునరావాస కేంద్రాల్లో వరద బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్యం అందించాలి. తాగునీరు, ఆహారం పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలి. వీటికి నిధుల కొరత లేకుండా కలెక్టర్లు చూసుకోవాలి. పునరావాస కేంద్రాల్లో వసతులు, సౌకర్యాలు ఉండాలి. ప్రజల నుంచి చిన్న ఫిర్యాదు కూడా రాకూడదు. ముందస్తు ప్రణాళికతో ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలి’ అని సీఎం నిర్దేశించారు. ‘తుఫాన్ వల్ల గాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని తెలుస్తోంది. విద్యుత్ శాఖ పూర్తి సన్నద్ధతతో ఉండి, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలి. విద్యుత్ పునరుద్ధరణ వేగంగా జరిగేలా చూడాలి. గాలుల వల్ల సెల్‌ఫోన్ నెట్‌వర్క్ దెబ్బతింటే.. వెంటనే పునరుద్ధరించేలా ఏజెన్సీలను సిద్ధం చేయాలి. ఈ విషయంలో జాప్యాన్ని సహించవద్దు’ అని అన్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. సముద్రంలో వేటకు వెళ్లిన అన్ని బోట్లు తీరానికి వచ్చేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. భారీ వర్షాలతో వచ్చే వరద నీటితో రిజర్వాయర్లలో నింపేలా ఇరిగేషన్ అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకసారి తుఫాన్ ప్రభావం మొదలై, రాకపోకలకు అటంకం కలిగితే గర్భిణులు ఇబ్బందులు పడతారని, ఈ వారంలో కాన్పు అయ్యే గర్భిణులను ముందుగానే ఆసుపత్రికి తరలించాలని సూచించారు. తుఫాన్ సహాయ చర్యల కోసం 10ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉంచినట్లు అధికారులు చెప్పారు. వ్యవసాయ, విద్యుత్, పంచాయతీరాజ్, మున్సిపల్, హోం, ఫైర్, ఇరిగేషన్, పౌరసరఫరాలశాఖల అధికారులు సన్నద్ధత చర్యలను సీఎంకు వివరించారు.

భారీగా వర్షపాతం నమోదుకు చాన్సు

ప్రస్తుతం విశాఖకు తూర్పు ఆగ్నేయంగా 850, కాకినాడకు 930కిలోమీటర్ల దూరంలో ఉన్న వాయుగుండం సోమవారానికి తుఫాన్‌గా, అదే రోజు రాత్రికి తీవ్ర తుఫాన్‌గా, మంగళవారానికి అతితీవ్ర తుఫాన్‌గా బలపడే అవకాశం ఉందని వాతావరణశాఖ, విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు సీఎంకు చెప్పారు. 28న ఉదయం నుంచి మధ్యాహ్నం లోగా బాపట్ల- విశాఖ మధ్య తుఫాన్ తీరం దాటే అవకాశం ఉందని, ప్రస్తుత అంచనాల్లో కోనసీమ-యానం-కాకినాడ తీర ప్రాంతంలో తీరం దాటొచ్చని వెల్లడించారు. మంగళ, బుధవారాల్లో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని చెప్పారు. అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా సగటున 29.25, అల్లూరి 28.11, విశాఖ 25.3.8, శ్రీకాకుళం 24.98 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా ఐదు రోజుల సగటు వర్షపాతం 9.5 సెంటీమీటర్లు, తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో సగటున 22-29 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అంచనా ఉన్నట్లు అధికారులు వివరించారు.

ఓట్ బచావో..దేశ్ బచావో : రాహుల్

ఒకటి తరువాయి

ఆదివారం ‘ఎక్స్’ వేదికగా పేర్కొన్నారు. “మన ఓట్లను హరిస్తున్నారు... దీన్ని మనం ఎట్టి పరిస్థితుల్లోనూ మౌనంగా సహించేది లేదు... ఓటర్ల జాబితాల నుంచి పేర్లను తొలగించారు. నిబంధనలను నీరుగార్చారు. ప్రశ్నించిన వారిపై లాఠీలతో విరుచుకుపడ్డారు. ఇప్పుడు దేశమే దీనికి సమాధానం చెబుతుంది. నవంబరు 1న దిల్లీకి తరలిరండి... ‘ఓటును కాపాడుకుందాం-దేశాన్ని రక్షించుకుందాం’ పేరిట చేపట్టే జన్ మార్చ్, భారీ బహిరంగ సభలో పాల్గొనండి. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలనే తపన ఉన్న విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, వ్యాపారులు... ఇలా ప్రతీ ఒక్కరూ కదలి రావాలి. ఓటూ మీదే... పోరాటమూ మీదే...” అంటూ ‘ఎక్స్’ వేదికగా రాహుల్ వెల్లడించారు. మరోవైపు “న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి అత్యంత ఉత్సాహంగా ప్రచారం కల్పిస్తూ, విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్న బీజేపీ, దాని మిత్రపక్షాలకు హృదయపూర్వక ధన్యవాదాలు... రాబోయే ఏడు రోజులపాటు ఇదే దీక్షాదక్షతలను కొనసాగించండి” అని ఎద్దేవా చేశారు. నవంబరు 1న 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల వార్షికోత్సవం ఉన్నందున ఆ రోజు సభ నిర్వహిస్తే సిక్కుల మనోభావాలు దెబ్బతింటాయని బీజేపీ పేర్కొన్న నేపథ్యంలో రాహుల్ ఇలా స్పందించారు. కాగా ఢిల్లీ చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ కూడా నవంబరు 1న సభ నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తోంది. పండుగ సీజన్ వ్యాపారం దెబ్బతింటుందని, నవంబరు 10వ తేదీ వరకు సభ వాయిదా వేయాలని రాహుల్‌గాంధీని కోరింది. అలాగే ఫెడరేషన్ ఆఫ్ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ ఆఫ్ ఇండియా కూడా నవంబరు 1న సభ నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తోంది. కాగా ఇండియా కూటమి నేతలు ఈ నెల 30న ఢిల్లీలోని అశోకా హోటల్‌లో మాక్ పార్లమెంట్ నిర్వహించి సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై మాక్ అభిశంసన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు.

ప్రేక్షక పాత్ర వద్దు..
జోక్యం చేసుకోండి!

ఒకటి తరువాయి

ప్రభావాన్ని దూర ప్రాంతాల ప్రజలు, ఆర్థిక వ్యవస్థలు కూడా ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ వివాదాల పరిష్కారానికి చర్చలు, దౌత్యమే మార్గాలని భారత్ విశ్వసిస్తోందని, శాంతి పునరుద్ధరణ కోసం ఇతర దేశాలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఢిల్లీలో ఆదివారం ఐక్యరాజ్యసమితి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ‘చిన్మయ అమృత మహోత్సవ్ గ్లోబల్ కాన్ఫరెన్స్’లో జైశంకర్ ప్రసంగించారు. ప్రపంచంలో ప్రస్తుతం రెండు ప్రధాన ఘర్షణలు కొనసాగుతున్నాయని.. ఒకటి ఉక్రెయిన్‌లో, మరొకటి పశ్చిమాసియా లేదా మధ్యప్రాచ్యంలో జరుగుతున్నాయని అన్నారు. ఈ పరిణామాల్లో ప్రత్యక్షంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం లేని ఇతర దేశాల ప్రజలు, ఆర్థిక వ్యవస్థలు కూడా మూల్యం చెల్లించుకుంటున్నాయని వివరించారు. “మనం నిస్సహాయ ప్రేక్షకులుగా మిగిలిపోలేం. చర్చలు, దౌత్యమే పరిష్కార మార్గాలని భారత్ స్పష్టం చేస్తోంది. శాంతిని పునరుద్ధరించేందుకు మేం స్వయంగా ప్రయత్నిస్తున్నాం. ఇతర భాగస్వామ్య దేశాలతో కలిసి పనిచేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాం” అని జైశంకర్ పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి తన లోపాలు, పరిమితులను గుర్తించి మెరుగుపడేందుకు ప్రయత్నించాలని విదేశాంగ మంత్రి సూచించారు. ప్రపంచ వ్యవహారాల్లో నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో అనేక దేశాలకు తగిన ప్రాతినిధ్యం లేదని, ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉందని చెప్పారు. బహుళపక్ష సహకార వ్యవస్థలో సంస్కరణల అవసరం రోజురోజుకూ పెరుగుతోందని అభిప్రాయపడ్డారు. ఎనిమిది దశాబ్దాల క్రితం ఐరాస స్థాపన ద్వారా దేశాల సమష్టి సహకారం, ఉమ్మడి లక్ష్యాల సాధనకు మార్గం ఏర్పడిందని జైశంకర్ గుర్తుచేశారు. ఐరాస చార్టర్‌లోని ఆర్టికల్ 1 కూడా ఉమ్మడి లక్ష్యాల సాధనలో దేశాల చర్యలను సమన్వయం చేసే కేంద్రంగా ఈ సంస్థ వ్యవహరించాలని పేర్కొంటోందని వివరించారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను సమర్థంగా పరిష్కరించాలంటే దేశాలన్నీ కలిసి పనిచేయాలని అన్నారు.

ప్రపంచ నిర్ణయాల్లో అందరికీ భాగస్వామ్యం

దేశాల మధ్య పోటీకి ప్రాధాన్యమిచ్చేవారు ఒకవైపు, సహకారంలోనే ప్రయోజనం ఉందని భావించే వారు మరోవైపు ఉంటారని జైశంకర్ పేర్కొన్నారు. వ్యక్తిగత, సామాజిక స్థాయిలో కనిపించే ఈ భిన్న ధోరణులు అంతర్జాతీయ వేదికపై దేశాల పరస్పర సంబంధాల్లోనూ ప్రతిఫలిస్తాయని చెప్పారు. దేశాలు తమ సామర్థ్యాలను ఉమ్మడి ప్రయోజనాల కోసం వినియోగించుకోవాలంటే పరస్పరం సహకరించాలనే మనస్తత్వం అవసరమని వివరించారు. అత్యంత అభివృద్ధి చెందిన దేశాలే సహకారానికి ఆదర్శంగా నిలవాల్సిన అవసరం లేదని, ప్రతి దేశం తన వంతు సహకారం అందించవచ్చని అన్నారు. ప్రపంచ సంక్షోభాల పరిష్కారంలో ఐరాస మరింత చురుకైన పాత్ర పోషించాలని, అంతర్జాతీయ నిర్ణయాల్లో విస్తృత ప్రాతినిధ్యం కల్పించేలా సంస్కరణలు చేపట్టాలని జైశంకర్ పిలుపునిచ్చారు. ఈ నెలలో జరిగిన కౌటిల్య ఆర్థిక సదస్సులోనూ జైశంకర్ ఐరాస సంస్కరణల అవసరాన్ని ప్రస్తావించారు. ఉక్రెయిన్, గల్ఫ్ ప్రాంత ఘర్షణలు సహా ప్రధాన అంతర్జాతీయ సమస్యలపై నిర్ణయాలు తీసుకోవడంలో ఐరాస ప్రభావం తగ్గుతోందని ఆయన గతంలో వ్యాఖ్యానించారు. ఐరాస భద్రతా మండలి ప్రపంచంలోని అన్ని దేశాల ప్రయోజనాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం లేదన్న అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేశారు. ప్రస్తుత యుద్ధాలు, అంతర్జాతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఐరాస తన పాత్రను మరింత సమర్థంగా నిర్వహించాల్సిన అవసరాన్ని జైశంకర్ వ్యాఖ్యలు మరోసారి ముందుకు తెచ్చాయి. అయితే ఘర్షణలను తగ్గించేందుకు ఏ నిర్దిష్ట చర్యలు చేపట్టాలన్న దానిపై ఈ ప్రసంగంలో పూర్తి కార్యాచరణను ఆయన వెల్లడించలేదు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల తుది జాబితా

ఒకటి తరువాయి

బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. జడ్పీటీసీ స్థానాలకు మొత్తం 5,724 నామినేషన్లు రాగా, వాటిలో 954 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. జిల్లాల వారీగా గణాంకాలను పరిశీలిస్తే.. తిరుపతి జిల్లాలో 35 జడ్పీటీసీ స్థానాలకు అత్యధికంగా 280 నామినేషన్లు ఆమోదం పొందాయి. కడప జిల్లాలో 39 స్థానాలకు 215, విశాఖ జిల్లాలో 4 స్థానాలకు 46 నామినేషన్లు ఖరారయ్యాయి.

విద్యుత్, ఆరోగ్య శాఖలు అప్రమత్తం

ఒకటి తరువాయి

క్షేత్రస్థాయిలో సిబ్బంది, ప్రజలు అప్రమత్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధానంగా తీసుకోవాల్సిన చర్యలపై డిస్కంల సీఎండీలు, డైరెక్టర్లు, జిల్లా అధికారులతో మంత్రులు ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీవర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో విద్యుత్ శాఖ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాను ప్రభావంతో విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అవసరమైన సిబ్బంది, పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. తుఫాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు 25 వేల విద్యుత్ స్తంభాలతో పాటు ఇతర సామగ్రిని సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. విద్యుత్ ప్రమాదాల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రులు ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను తొలగించేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు, సరఫరా సమస్యలు ఎదురైతే 1912 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలని కోరారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, ప్రభుత్వ సంస్థలు అధికారికంగా జారీ చేసే సూచనలను పరిగణలోకి తీసుకుని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

క్షేత్రస్థాయిలో అధికారుల మకాం!

తుఫాను హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ శాఖలు హైఅలర్ట్ ప్రకటించాయి. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదివారం అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సోమవారం నుంచి తుఫాను ప్రభావం తగ్గి పరిస్థితులు చక్కబడే వరకు డిస్కంల సీఎండీలు, డైరెక్టర్లు ప్రభావిత ప్రాంతాల్లోనే ఉంటూ పరిస్థితిని సమీక్షించాలని విజయానంద్ ఆదేశించారు. జోనల్ చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, విపత్తు నిర్వహణలో పాల్గొనే కీలక సాంకేతిక సిబ్బందికి ఎలాంటి సెలవులూ మంజూరు చేయరాదని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే వెంటనే పునరుద్ధరించాలని, విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జెన్కో ఎండీ ఎస్. నాగలక్ష్మి, ట్రాన్స్కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్ చంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి..డీఎంహెచ్‌వోలకు ఆరోగ్య మంత్రి సత్యకుమార్ ఆదేశం

తుఫాను ప్రభావం దృష్ట్యా 27 నుంచి 30 వరకు ప్రభుత్వాసుపత్రులు, ప్రాథమిక, గ్రామస్థాయి ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. వ్యాధులతో బాధపడేవారికి వైద్య సేవల్లో అంతరాయం కలగకూడదని సూచించారు. మంత్రి సూచనల మేరకు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్‌బాబు అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీచేశారు. ‘జిల్లాల్లో 24 గంటలూ పనిచేసే అత్యవసర నియంత్రణ గదులు ఏర్పాటు చేయాలి. వరద ముప్పు, లోతట్టు ప్రాంతాలను గుర్తించి ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది, మందులు, పరికరాలు, విద్యుత్తు, నీటి సదుపాయాలను తనిఖీ చేయాలి. వైద్య సిబ్బందికి విధులు కేటాయించి అదనపు సిబ్బందిని సిద్ధంగా ఉంచాలి. రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖలతో పాటు 108, 104, 102 సేవలతో సమన్వయం చేసుకోవాలి. దెబ్బతిన్న వైద్యపరికరాలు, సదుపాయాలకు మరమ్మతులు చేపట్టాలి. జిల్లా స్థాయిలో సన్నద్ధత, సమన్వయం, పర్యవేక్షణ బాధ్యత జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులదే’నని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రమాదంలో ఉన్న కుటుంబాలను గుర్తించడం, ప్రజలకు హెచ్చరికలు ఇవ్వడం, వ్యాధులపై నిఘా, సమాచార నివేదికల బాధ్యతలు గ్రామస్థాయి సిబ్బంది నిర్వహించాలని ఆదేశించారు.

సైబర్ దాడులతో ఆర్థిక వ్యవస్థకు ముప్పు : మోదీ

ఒకటి తరువాయి

సాగాలని ప్రధాని అన్నారు. స్వాతంత్ర్యం తర్వాత ప్రధాన నగరాల్లో పెద్ద ఆసుపత్రులు, విమానాశ్రయాలు, ఇతర మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందినప్పటికీ.. చిన్న పట్టణాలు, మారుమూల ప్రాంతాలు ప్రాథమిక సౌకర్యాలు, కనెక్టివిటీ కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నాయని గుర్తుచేశారు. ప్రజాహిత, చురుకైన సుపరిపాలన విధానంతో చిన్న పట్టణాలు, గ్రామాలకు ఎక్స్‌ప్రెస్‌వేలు, వైద్య కళాశాలలు, ఆరోగ్య సేవలు, డిజిటల్ కనెక్టివిటీని విస్తరిస్తున్నట్లు తెలిపారు. 1960, 1970 దశకాల్లో పేదలకు ప్రయోజనం చేకూర్చాలనే ఉద్దేశంతో బ్యాంకుల జాతీయీకరణ జరిగినప్పటికీ, 2014 వరకు దేశ జనాభాలో సగానికిపైగా ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేవని మోదీ అన్నారు. గతంలో కొందరు కాంగ్రెస్ నాయకులకు సన్నిహితంగా ఉన్నవారికి ఫోన్ ద్వారా వేల కోట్ల రూపాయల రుణాలు మంజూరయ్యేవని ఆయన ఆరోపించారు. దీనిని ‘ఫోన్ బ్యాంకింగ్’గా అభివర్ణించారు. ప్రస్తుత ప్రభుత్వం డిజిటల్ బ్యాంకింగ్ ద్వారా దేశవ్యాప్తంగా ఆర్థిక సేవల ప్రాప్యతను విస్తరించిందని పేర్కొన్నారు. దాదాపు 59 నుంచి 60 కోట్ల జన్‌ధన్ ఖాతాలు ప్రజలను అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాయని తెలిపారు.

లబ్ధిదారుల ఖాతాల్లోకే ప్రభుత్వ సాయం

గతంలో కేంద్రం నుంచి పంపిన నిధుల్లో కొంత భాగమే లబ్ధిదారులకు చేరేదన్న మాజీ ప్రధాని వ్యాఖ్యలను మోదీ ప్రస్తావించారు. ప్రస్తుతం ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) విధానం ద్వారా ప్రభుత్వ సాయం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు చేరుతోందని అన్నారు. గత దశాబ్దంలో బ్యాంకింగ్ సేవలకు దూరంగా ఉన్న ప్రజలను ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడంపై దృష్టి పెట్టామని, రాబోయే దశాబ్దంలో బ్యాంకింగ్ సేవలను మరింత సమర్థవంతంగా, విశ్వసనీయంగా మార్చడమే లక్ష్యమని ప్రధాని తెలిపారు.

ఒడిశాలో సాంకేతిక రంగానికి కొత్త అవకాశాలు

అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణంలో తూర్పు భారతదేశం కీలక వృద్ధి చోదకంగా నిలుస్తుందని మోదీ అన్నారు. ఒడిశా సంప్రదాయ ఖనిజ వనరులతో పాటు సాంకేతిక రంగంలోనూ పురోగతి సాధిస్తోందని పేర్కొన్నారు. గనుల ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి మైక్రోచిప్‌లు, డేటా సెంటర్లు, అధునాతన కంప్యూటింగ్ వంటి రంగాల వైపు ఒడిశా అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ రంగాల్లో పెట్టుబడులు రాష్ట్ర యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎంతటి లక్ష్యమైనా భారత బలగాలను దాటిపోలేదు

ఒకటి తరువాయి

చేయనున్న నేపథ్యంలో పీటీఐకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఆపరేషన్‌తో భారత వాయుసేన వ్యూహాత్మకంగా ముందడుగు వేసి, ఉగ్రవాదులను కోలుకోలేని దెబ్బ తీసిందని ఆయన వివరించారు.గతేడాది మే నెలలో పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా ‘ఆపరేషన్ సిందూర్’ చేపట్టామని ఏపీ సింగ్ గుర్తుచేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా 1,200 కిలోమీటర్ల వెడల్పు, 200 కిలోమీటర్ల లోతు వరకు విస్తరించి ఉన్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై నిర్దిష్ట దాడులు చేశామని తెలిపారు. ఈ దాడుల ద్వారా ఏ ప్రదేశమైనా ఐఏఎఫ్ పరిధికి అతీతం కాదని తేల్చిచెప్పినట్లు అయిందన్నారు. ఆపరేషన్‌లో ఒక్క సామాన్య పౌరుడికి కూడా హాని కలగకుండా ‘జీరో కొలేటరల్ డ్యామేజ్’ సూత్రాన్ని కచ్చితంగా పాటించామని ఆయన గర్వంగా చెప్పారు.ఈ ఆపరేషన్ విజయవంతం కావడం వెనుక కేవలం ఒక ఆయుధం లేదా ఒక విమానం మాత్రమే లేదని, కచ్చితమైన ఇంటెలిజెన్స్, నెట్‌వర్క్ ఆపరేషన్స్, స్టాండ్-ఆఫ్ ఆయుధాలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, బహుళ-స్థాయి గగనతల రక్షణ వ్యవస్థల సమన్వయం ఉందని ఏపీ సింగ్ విశ్లేషించారు. ముఖ్యంగా, పాకిస్థాన్ సైన్యం ప్రయోగించిన డ్రోన్లు, ఇతర ఆయుధాలను మన స్వదేశీ గగనతల రక్షణ వ్యవస్థ సమర్థవంతంగా ఎదుర్కొందని అన్నారు. ఈ ఆపరేషన్‌లో కొన్ని స్వదేశీ ఆయుధ వ్యవస్థలు అద్భుతంగా పనిచేసి, శత్రు భూభాగంలోకి చొచ్చుకెళ్లి పెను నష్టాన్ని కలిగించాయని తెలిపారు. స్వదేశీ ఉత్పత్తి రక్షణ రంగాన్ని ఆధునికీకరించడమే కాకుండా, భారతదేశ వ్యూహాత్మక స్వావలంబనను బలోపేతం చేస్తోందని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుత ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారతదేశ సామర్థ్యాలను ప్రదర్శించడం జాతీయ భద్రతకు చాలా కీలకమని ఎయిర్ చీఫ్ మార్షల్ అభిప్రాయపడ్డారు. ఆ వనరులు అధికంగా ఉండే ప్రాంతంలో చైనా సైనిక విస్తరణపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన పెరుగుతోందని, ఈ నేపథ్యంలో భారత వాయుసేన పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని చెప్పారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడటానికి క్వాడ్ భాగస్వాములైన అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో కలిసి భారత్ పనిచేస్తోందని తెలిపారు. ఇటీవల ఆస్ట్రేలియా, మలేషియా, థాయ్‌లాండ్‌లలో ఐఏఎఫ్ జరిపిన విన్యాసాలు సుదూర, సముద్ర గగనతల కార్యకలాపాలలో అమూల్యమైన అనుభవాన్ని అందించాయని ఆయన వివరించారు.‘వికసిత భారత్ 2047’ జాతీయ దార్శనికతకు అనుగుణంగా ఐఏఎఫ్ దీర్ఘకాలిక ప్రణాళికలు ఉన్నాయని ఏపీ సింగ్ తెలిపారు. 2047 నాటికి భారత వాయుసేనను ప్రపంచంలోనే అత్యంత సమర్థవంతమైన, వినూత్నమైన, సాంకేతికంగా స్వావలంబన కలిగిన బహుళ-డొమైన్ ఏరోస్పేస్ శక్తిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశానికి రక్షణ, భద్రత పునాదులని, ఆ లక్ష్య సాధనలో ఐఏఎఫ్ తన పూర్తి పాత్రను పోషిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

PRINTED, PUBLISHED AND OWNED DONDLAVAGU BHAVYA,
ARUNODAYA OFFSET PRINTERS“#33-5-9, PAPAIAH STREET, SEETHARAMPURAM, VIJAYAWADA“PH: 0866-2431422, 9346504777
“E-MAIL: ARUNODAYAVJW@GMAIL.COM . EDITOR DONDLAVAGU BHAVYA. 08562-461571 APTEL/2026/A2902